జైత్ర
మల్టీ స్పెషాలిటీ
హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి
# శ్వేత
JYOTHISHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ॥ సంపుటి:1 ॥ సంచిక: 144 ॥ సోమవారం ॥ 19-10-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-

19 అక్టోబర్ 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు ఆశ్వయుజ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:13 సూర్యాస్తమయం - సా. 5:48 తిథి అష్టమి ఉ. 10:50 వరకు తరువాత నవమి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం ఉత్తరాషాఢ మ. 3:27 వరకు తరువాత శ్రవణ యోగం ధృతి రా. 12:29o వరకు కరణం బవ ఉ. 10:50 వరకు భాలవ రా. 11:52 వరకు వర్జ్యం రా. 8:02 నుండి రా. 9:48 వరకు దుర్ముహూర్తం మ. 12:24 నుండి మ. 1:10 వరకు మ. 2:43 నుండి మ. 3:29 వరకు రాహుకాలం ఉ. 7:40 నుండి ఉ. 9:07 వరకు యమగండం ఉ. 10:34 నుండి మ. 12:01 వరకు గుళికాకాలం మ. 1:27 నుండి మ. 2:54 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:37 నుండి తె. 5:25 వరకు అమృత ఘడియలు ఉ. 8:28 నుండి ఉ. 10:16 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:37 నుండి మ. 12:24 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున







## యూకేలో బతుకమ్మ సంబరాలు..
# శ్వేత, పద్మకృష్ణల సందడి!

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు యూకేలో ఘనంగా జరిగాయి. విదేశీ గడ్డపై తెలంగాణ ఆడపడుచులు సంప్రదాయబద్ధంగా బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. శ్వేత డైలీ న్యూస్ పేపర్ డైరెక్టర్ శ్వేత, పద్మకృష్ణ తమ సహచరులతో కలిసి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలతో వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తెలంగాణ సంస్కృతి, ఆచార వ్యవహారాలను విదేశాల్లోనూ కొనసాగించడం ఆనందంగా ఉందని పాల్గొన్నవారు పేర్కొన్నారు. తెలంగాణ మహిళలంతా ఒకచోట చేరి బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు.

# ఫ్రాన్స్‌లో హింసాత్మకం



## 143 ఏళ్ల చారిత్రక భవనానికి నిప్పు
### 1200 మంది అరెస్ట్, 150 మంది పోలీసులకు గాయాలు
### హింసకు తావులేదు: ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్
### వలస విధానాల వల్లే హింస: అమెరికా

**ఫ్రాన్స్‌లో పెరుగుతున్న జీవన వ్యయానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలు హింసాత్మకంగా మారి తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. ఈ ఆందోళనల్లో భాగంగా 143 ఏళ్ల నాటి చారిత్రక లిమోజెస్ టౌన్ హాల్ భవనానికి ఆందోళనకారులు నిప్పు పెట్టారు. ఈ ఘటనలో భవనం చాలా వరకు ధ్వంసమైంది. ఈ భవనానికి 1873లో నిర్మాణం ప్రారంభం కాగా, 1883లో అధికారికంగా ప్రారంభించడం జరిగింది. ఈ భవనం ఫ్రాన్స్‌లో చారిత్రక కట్టడంగా గుర్తింపు పొందింది.**

పారిస్: ముసుగులు ధరించిన కొందరు ఆందోళనకారులు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు అధికారులు తెలిపారు. మంటల కారణంగా భవనం పైకప్పు పూర్తిగా కూలిపోయిందని, బయటి భాగంలో మూడింట రెండొంతులు నాశనమైందని వెల్లడించారు. ఇది దేశ వారసత్వ సంపదకు జరిగిన ఘోర విపత్తు అని స్థానిక ప్రిఫెక్ట్ మారిస్ బరేట్ ఆవేదన వ్యక్తం చేశారు. దుండగులు ఉద్దేశపూర్వకంగానే ఈ దాడికి పాల్పడ్డారని ఆయన పేర్కొన్నారు. దేశంలో పెరుగుతున్న జీవన వ్యయం, పాఠశాలల్లో పరిస్థితులకు వ్యతిరేకంగా లక్షలాది మంది మొదట శాంతియుతంగా ప్రదర్శనలు చేపట్టారు. అయితే, పారిస్‌తో పాటు తరువాయి 2 వ పేజీలో...




## ఎయిర్‌టెల్‌లో 'వాయిస్ కాల్స్' ప్లాన్లు అందుబాటులోకి

**టెలికం రంగంలో వినియోగదారులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న మొబైల్ డేటాతో అవసరం లేని, కేవలం వాయిస్ కాలింగ్, ఎస్సెమ్మెస్ సేవలను ప్రైవేట్ దిగ్గజం ఎయిర్‌టెల్ ప్రారంభించింది. సబ్‌స్క్రైబర్ల కోసం రూ. 185, రూ. 203, రూ. 206 ధరలతో మూడు ప్రత్యేక ప్రీపెయిడ్ ప్లాన్‌లను మార్కెట్లోకి తీసుకువచ్చింది.**

న్యూఢిల్లీ: టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) విధించిన అక్టోబర్ 21 డెడ్‌లైన్‌కు కొద్ది రోజుల ముందే ఈ ప్లాన్‌లను అందుబాటులోకి తెచ్చిన తొలి టెలికం ఆపరే టర్‌గా ఎయిర్‌టెల్ నిలిచింది. కంపెనీ వెబ్‌సైట్, థర్డ్-పార్టీ రీఛార్జ్ యాప్‌లలో ఇవి ఇప్పటికే అందుబాటులోకి తరువాయి 2 వ పేజీలో..



# పోయిరావమ్మ బతుకమ్మా..!

### ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు
### హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై వేడుకలు
### పాల్గొన్న తెలంగాణ కోడలు రష్మిక మందన్నా

హైదరాబాద్, అక్టోబర్ 18 : తెలంగాణ వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ సంబురాలు ఘనంగా సాగాయి. హైదరాబాద్‌లో ట్యాంక్‌బండ్‌పై భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ట్యాంక్‌బండ్ అమరవీరుల స్మారకం నుంచి మహా బతుకమ్మ ర్యాలీ నిర్వహించారు. 700 మంది కళాకారులు, 600 మందికిపైగా మహిళలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ట్యాంక్ బండ్‌పై ఆటపాటలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, సినీనటుడు విజయ్ దేవరకొండ-రష్మిక దంపతులు పాల్గొన్నారు. ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ వేడుకల్లో ఫైర్‌వర్క్స్, లేజర్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ అందరికీ దసరా, సద్దుల తరువాయి 2 వ పేజీలో...



## భక్తులపైకి దూసుకెళ్లిన భారీ ట్రక్కు
### 12 మంది మృతి
### పలువురికి గాయాలు

భోపాల్: మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. భక్తులపైకి ట్రక్కు దూసుకెళ్లడంతో 12 మంది దుర్మరణం చెందారు. 39 మంది వరకు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన గ్వాలియర్ జిల్లాలో శీతలా మాత ఆలయం వద్ద శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఈప్రమాదంలో భక్తులు అక్కడికక్కడే మరణించారు. స్థానికులు, గ్వాలియర్ ఎస్పీ ధర్మవీర్ సింగ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ క్రమంలో చిన్నిర్ వైపు నుంచి వడ్ల లోడుతో వస్తున్న ఒక వస్తున్న భారీ ట్రక్కు అదుపు తప్పి భక్తులపైకి దూసుకెళ్లడంతో 12 మంది అక్కడికక్కడే మృతి చెందారు. ఆ మార్గంలో భారీ వాహనాల ప్రవేశంపై నిషేధం ఉన్నప్పటికీ, లారీ అక్కడున్న పోలీస్ బారికేడ్లను, చెక్‌పోస్టును బద్దలుకొట్టుకుంటూ వేగంగా దూసుకొచ్చిందని స్థానికులు తెలిపారు. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న భక్తులను తొక్కుకుంటూ వెళ్లడమే కాకుండా, శీతలా మాత ఆలయ తరువాయి 2 వ పేజీలో...

# నేటి రాశి ఫలాలు

మేషం: వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగమున అధికారుల ఆగ్రహానికి గురి అవుతారు. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. చేపట్టిన పనులు కష్టసాధ్యంతో పూర్తవుతాయి. స్థిరాస్తి వ్యవహారాలలో పెద్దలతో మాటపట్టింపులు తప్పవు. సంతాన విద్యా విషయాలు నిరుత్సాహపరుస్తాయి.

వృషభం: సోదరులతో మనస్పర్ధలు తొలగుతాయి. గృహ వాతావరణం సంతోషకరంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు తీసుకుని లాభాలు అందుకుంటారు. ముఖ్యమైన వ్యవహారాలలో స్వంత ఆలోచనలు కలసివస్తాయి. అవసరానికి ఇతురుల నుండి ధన సహాయం అందుతుంది. నూతన ఉద్యోగ అవకాశలు అందుతాయి.

మిధునం: నూతన వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహపరుస్తాయి. ఉద్యోగులకు అధికారుల నుండి ఒత్తిడి తప్పదు. నేత్ర సంభందిత అనారోగ్య సమస్యలు కొంత బాధిస్తాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి గంధరగోళంగా ఉంటుంది. దైవ చింతన పెరుగుతుంది.

కర్కాటకం: సంతాన విద్యా ఉద్యోగ విషయాలు సంతృప్తికరంగా సాగుతాయి. వ్యాపారాలలో ఆశించిన విధంగా రాణిస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలకు లోటుండదు. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. దూరపు బంధువుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది.

సింహం: ఆదాయనికి మించి ఖర్చులు పెరుగుతాయి. ఋణదాతల ఒత్తిడి పెరుగుతుంది. ఉదర సంబంధ అనారోగ్య సమస్యలు భాదిస్తాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. వ్యాపారాలలో ఊహించని సమస్యలు ఎదురవుతాయి. వృత్తి ఉద్యోగాలలో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.

కన్య: సంఘంలో ప్రముఖుల నుండి విశేషమైన ఆదరణ లభిస్తుంది. సంతాన ఉద్యోగ వివాహ ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తాయి. ధన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. గృహమున సంతాన శుభకార్య విషయమై ప్రస్తావన వస్తుంది. ముఖ్యమైన పనులు బంధుమిత్రుల సహాయ సహకారాలతో పూర్తి చేస్తారు.

తుల: ఉద్యోగమున చాలాకాలంగా వేదిస్తున్న సమస్యలు పరిష్కరించుకుంటారు. వ్యాపార వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి. ఇంటాబయటా అనుకూల వాతావరణం ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో స్వంత ఆలోచనలతో ముందుకు సాగడం మంచిది. బంధువులతో చిన్నపాటి వివాదాలు ఉంటాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

వృశ్చికం: ఒక వ్యవహారంలో ఇతరుల ప్రవర్తన వలన మానసిక అశాంతి కలుగుతుంది. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు విఫలమౌతాయి. కుటుంబ సభ్యులతో చిన్నపాటి మాటపట్టింపులుంటాయి. చేపట్టిన పనులు మధ్యలో నిలిచిపోతాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.

ధనస్సు: వృత్తి వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులుంటాయి. నిరుద్యోగులకు అతి కష్టం మీద అల్ప ఫలితం పొందుతారు. ఉద్యోగాలలో బాధ్యతలు మరింత అధికమౌతాయి. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. కొన్ని వ్యవహారాలు సమస్యాత్మకంగా సాగుతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి.

మకరం: ఉద్యోగమున అధికారుల ఆదరణ పెరుగుతుంది. కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ప్రయాణాలలో నూతన పరిచయాలు కలుగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో జీవిత భాగస్వామి సలహాలు కలసివస్తాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.

కుంభం: బంధు మిత్రులతో సఖ్యత పెరుగుతుంది. వ్యాపారాలలో శత్రు సమస్యలు నుండి తెలివిగా బయటపడతారు. ఇంటా బయట అనుకూల వాతావరణం ఉంటుంది. ఆర్థిక ఆలోచనలు అనుకూలంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. సన్నిహితులతో గృహమున ఆనందంగా గడుపుతారు.

మీనం: నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. దూరప్రాంత బందు మిత్రుల నుండి శుభవార్తలు అందుతాయి. ఉద్యోగమున మంచి పనితీరుతో అధికారుల నుండి ప్రశంసలు పొందుతారు. కీలక సమయంలో మంచి ఆలోచనా జ్ఞానంతో ముందుకు సాగుతారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.



# నామినేషన్లకు తెర.. ఇక పరిశీలన వంతు

## మున్సిపల్ ఎన్నికల్లో కీలక ఘట్టం పూర్తి... 28న పోలింగ్.. 30న ఫలితాలు

అమరావతి: రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసింది. చెదురుమదురు ఘటనలు, పలు ఇబ్బందుల మధ్య అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. ఆదివారం చివరి రోజు కావడంతో నామినేషన్ల సమర్పణకు అభ్యర్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో పలు ప్రాంతాల్లోని రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద సందడి నెలకొంది. చివరి రోజు నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు పోటీపడటంతో ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కింది.

నామినేషన్ల దాఖలుకు ఆదివారం చివరి రోజు కావడంతో ఉదయం నుంచే అభ్యర్థులు, వారి మద్దతుదారులు ఆర్వో కార్యాలయాల వద్దకు చేరుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల సమయానికి క్యూలైన్లలో ఉన్న అభ్యర్థులందరికీ నామినేషన్లు సమర్పించేందుకు అధికారులు అవకాశం కల్పించారు. నామినేషన్ల దాఖలులో ఇబ్బందులు ఎదుర్కొన్న అభ్యర్థులతో ఎన్నికల అధికారులు మాట్లాడి, నిబంధనల ప్రకారం ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. కొన్ని ప్రాంతాల్లో చెదురుమదురు ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగింది.

నామినేషన్ల స్వీకరణ ముగియడంతో ఇక ఎన్నికల ప్రక్రియలో కీలకమైన పరిశీలన దశ ప్రారంభం కానుంది. నేటి నుంచి ఎన్నికల అధికారులు అభ్యర్థులు సమర్పించిన నామినేషన్ పత్రాలను పరిశీలించనున్నారు. పత్రాల్లోని వివరాలు, అవసరమైన ధ్రువపత్రాలు, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నామినేషన్లు ఉన్నాయా లేదా అనే అంశాలను పరిశీలిస్తారు. నామినేషన్ల పరిశీలన అనంతరం అర్హులైన అభ్యర్థులపై స్పష్టత రానుంది. దీంతో ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల సంఖ్యపై ఆసక్తి నెలకొంది.

ఈ నెల 21న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ జరగనుంది. ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత తుది బరిలో నిలిచే అభ్యర్థుల జాబితా వెల్లడికానుంది. ఆ తర్వాత ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకోనుంది. రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల తరపున ప్రచారాన్ని ముమ్మరం చేయడంతో పాటు ఓటర్లను




ఆకట్టుకునేందుకు వ్యూహాలు సిద్ధం చేయనున్నాయి. స్థానిక సమస్యలు, అభివృద్ధి అంశాలు, అభ్యర్థుల వ్యక్తిగత ప్రభావం ఎన్నికల్లో కీలకంగా మారనున్నాయి.

ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 28న పోలింగ్ నిర్వహించనుండగా, 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు. నామినేషన్ల ఘట్టం ముగియడంతో ఇప్పుడు అందరి దృష్టి పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియలపై పడింది. తుది బరిలో ఎంతమంది అభ్యర్థులు నిలుస్తారు? ఏయే ప్రాంతాల్లో పోటీ ఎలా ఉండనుంది? అన్నది రానున్న రోజుల్లో స్పష్టమవుతుంది. మొత్తంగా మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ కీలక దశలోకి ప్రవేశించడంతో పట్టణ ప్రాంతాల్లో రాజకీయ సందడి మరింత పెరగనుంది.



# ఫ్రాన్స్‌లో హింసాత్మకం

**మొదటి పేజీ తరువాయి**

మార్సెల్, లియోన్, లిల్లే వంటి నగరాల్లోనూ ఈ నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఆందోళనకారులు లూటీలకు, దహనకాండలకు పాల్పడ్డారు. ఈ ఘటనల్లో దేశవ్యాప్తంగా సుమారు 1200 మందిని అదుపులోకి తీసుకున్నామని, 150 మందికి పైగా పోలీసులు గాయపడ్డారని ఫ్రెంచ్ అధికారులు తెలిపారు. ఈ హింసను ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ తీవ్రంగా ఖండించారు. “మన గణతంత్రంలో హింసకు తావులేదు” అని స్పష్టం చేశారు. ఈ ఘటనపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ‘ఎక్స్’ (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫ్రాన్స్‌లో నెలకొన్న అశాంతికి వలస విధానాలే కారణమని ఆయన ఆరోపించారు. “వైవిధ్యం, కరుణ పేరుతో పాశ్చాత్య ఉదారవాదులు మూడో ప్రపంచ దేశాలను ఫ్రాన్స్ వంటి దేశాల్లోకి దిగుమతి చేసుకున్నారు. కానీ, వారిని కలుపుకుపోవడం వంటి ప్రాథమిక ప్రశ్నలను విస్మరించారు” అని వ్యాఖ్యానించారు. మరిన్ని చారిత్రక కట్టడాలు కాలిపోకముందే ఫ్రాన్స్ ఈ ఆందోళనలను ఆపాలని, అమెరికాలో కాంగ్రెస్ డెమోక్రాట్లు కోరుకుంటున్న భవిష్యత్తు ఇదేనని హెచ్చరించారు.



# ఎన్నికల వేళ ఆరోపణల యుద్ధం

అమరావతి: పలు ప్రాంతాల్లో తమ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేకపోయారని, కొన్ని చోట్ల ఒక్క నామినేషన్ కూడా వేయలేని పరిస్థితి ఏర్పడిందని జగన్ ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో పోటీ చేసే హక్కు కీలకమని, నామినేషన్ దశలోనే అడ్డంకులు ఎదురైతే స్వేచ్ఛాయుత ఎన్నికల లక్ష్యం దెబ్బతింటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నామినేషన్ల ప్రక్రియలో అధికార పార్టీ నేతలు, పోలీసులు తమ పార్టీ అభ్యర్థులపై ఒత్తిడి తెచ్చారని జగన్ చేసిన ఆరోపణలు ఈ వివాదంలో ప్రధానాంశంగా మారాయి. గురజాల సహా కొన్ని ప్రాంతాల్లో అభ్యర్థులకు ఇబ్బందులు ఎదురయ్యాయని, పోలీసుల సహాయం లేకుండా నామినేషన్లు వేయలేని పరిస్థితులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. పులివెందుల లోనూ పరిమిత సంఖ్యలోనే తమ పార్టీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగలిగారని తెలిపారు. అయితే, ఈ ఆరోపణలన్నింటినీ నిర్ధారించడానికి ప్రాంతాలవారీగా ఎన్నికల అధికారుల నివేదికలు, పోలీసుల స్పందన, సంబంధిత ఆధారాలు అవసరం. నామినేషన్లు దాఖలు చేయకపోవడానికి అభ్యర్థుల కొరత, స్థానిక రాజకీయ పరిస్థితులు, ఇతర కారణాలు కూడా ఉండే అవకాశం ఉన్నందున ప్రతి ఘటనను విడివిడిగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. పోలీసు వ్యవస్థ తీరుపైనా జగన్ తీవ్ర విమర్శలు చేశారు. పోలీసు అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. ఎంపీ మిథున్‌రెడ్డికి సంబంధించిన ఘటనను ప్రస్తావిస్తూ పోలీసుల చర్యలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమైనది.

శాంతిభద్రతలను కాపాడటంతోపాటు అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులకు సమాన భద్రత కల్పించడం వారి బాధ్యత. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఆరోపణలు తీవ్రమవుతున్న తరుణంలో, పోలీసుల చర్యలపై వచ్చే ఫిర్యాదులను పారదర్శకంగా పరిశీలించడం అవసరం. ఆరోపణలు వచ్చినంత మాత్రాన అవి నిర్ధారిత వాస్తవాలుగా మారవు. అదే సమయంలో ఫిర్యాదులను విస్మరించకుండా తగిన విచారణ జరగడం ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందిస్తుంది.

రాష్ట్ర ఎన్నికల సంఘం పాత్ర కూడా ఇప్పుడు చర్చలోకి వచ్చింది. ఎన్నికల నిర్వహణలో ఎస్ఈసీ స్వతంత్రంగా, నిష్పాక్షికంగా వ్యవహరించాలని జగన్ కోరారు. నామినేషన్లు దాఖలు చేయడానికి ఇబ్బందులు ఎదురైన ప్రాంతాల్లో తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర బలగాల మోహరింపు, పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్, బ్యాలెట్ బాక్సులు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పర్యవేక్షణ వంటి అంశాలను కూడా ఆయన ప్రస్తావించారు. అయితే, ఈ డిమాండ్లపై ఎన్నికల సంఘం తీసుకున్న అధికారిక నిర్ణయాలు ఏమిటన్నది స్పష్టత రావాల్సి ఉంది. ఎన్నికల ప్రక్రియలో భద్రత, పారదర్శకతను పెంచే చర్యలను చట్టపరమైన పరిధిలో పరిశీలించడం ఎన్నికల సంఘం బాధ్యత.

ఇదే సమయంలో, ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత న్యాయస్థానాల జోక్యానికి సంబంధించిన పరిమితులు, నామినేషన్ల గడువు పొడిగింపుపై వచ్చిన పిటిషన్లు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నామినేషన్ల గడువు ముగిసినందున గడువు పొడిగించాలని వైసీపీ వేసిన అనుబంధ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. మరోవైపు, జిల్లా కేంద్రాల్లో నామినేషన్లు దాఖలు చేసుకునే వెసులుబాటుకు సంబంధించిన అంశంపై ఎన్నికల సంఘం నుంచి కౌంటర్ కోరినట్లు సమాచారం ఉంది. ఈ పరిణామాలు ఎన్నికల ప్రక్రియలో న్యాయపరమైన అంశాలు ఎంత కీలకమో స్పష్టం చేస్తున్నాయి. అయితే, న్యాయస్థానాల ఆదేశాల పరిధి, వాటి అమలు వివరాలను అధికారిక ఉత్తర్వుల ఆధారంగా మాత్రమే అంచనా వేయాలి. ఎన్నికల షెడ్యూల్, నిబంధనలు, అభ్యర్థుల హక్కుల మధ్య సమతుల్యత పాటించడం అత్యవసరం.

మొత్తంగా చూస్తే, స్థానిక సంస్థల ఎన్నికలపై జగన్ చేసిన ఆరోపణలు కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా ఎన్నికల నిష్పాక్షికత, పోలీసుల బాధ్యత, ఎన్నికల సంఘం స్వతంత్రత వంటి విస్తృత అంశాలను ముందుకు తెచ్చాయి.



## మళ్లొచ్చే ఏడు చాందమామ.. పోయిరావమ్మ బతుకమ్మా..!

**మొదటి పేజీ తరువాయి**

బతుకమ్మ శుభాకాంక్షలు చెప్పాడు. బతుకమ్మను చూస్తే చాలా ముద్దుగా అనిపిస్తుందని, ఇంట్లో వాళ్లు బతుకమ్మను చేస్తుంటారని విజయ్ గుర్తుచేసుకున్నాడు. మన పండుగలు ఇంత జోరుగా జరిపిస్తుంటే సంతోషంగా అనిపిస్తుందని విజయ్ హర్షం వ్యక్తం చేశాడు. పెళ్లి తర్వాత రష్మికతో కలిసి తెలంగాణలో జరిగే అతిపెద్ద బతుకమ్మ వేడుకల్లో పాల్గొనాలని ముందే అనుకున్నానని, అనుకున్నట్టుగానే తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని విజయ్ సంతోషం వ్యక్తం చేశాడు. అందరూ బాగుండాలని, అందరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటూ దసరా, సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు చెప్పాడు.

## ఎయిర్‌టెల్‌లో ‘వాయిస్ కాల్స్’ ప్లాన్లు అందుబాటులోకి

**మొదటి పేజీ తరువాయి**

వచ్చాయి. ఎయిర్‌టెల్ ప్రవేశపెట్టిన ఈ మూడు ప్లాన్‌లలోనూ బేసిక్ కాలింగ్ ప్రయోజనాలు ఒకేలా ఉంటాయి. ప్రతి ప్లాన్‌లోనూ దేశవ్యాప్తంగా అపరిమిత లోకల్, ఎస్‌టీడీ, రోమింగ్ కాల్స్‌తో పాటు మొత్తం 300 ఎస్సెమ్మెస్‌లు, ఉచిత హలోట్యూన్స్ లభిస్తాయి. ఇందులో రూ. 185 ప్లాన్ 28 రోజుల వ్యాలిడిటీని అందించే అత్యంత చౌకైన ఆప్షన్ కాగా, రూ. 203 రీఛార్జ్ సరిగ్గా 30 రోజుల వ్యాలిడిటీని ఇస్తుంది. ఇక రూ. 206 ప్లాన్ రోజులతో సంబంధం లేకుండా పూర్తి ఒక ‘క్యాలెండర్ నెల’ వ్యాలిడిటీతో రావడం విశేషం. ఈ ప్లాన్‌లు ప్రధానంగా ఫీచర్ ఫోన్లు ఉపయోగించే సాధారణ పౌరులకు, ఇళ్లలో నిరంతరం వై-ఫై నెట్‌వర్క్‌పై ఆధారపడే వారికి, కేవలం ఇన్ కమింగ్/కాలింగ్ కోసం మాత్రమే సెకండరీ సిమ్ కార్డ్‌ను నిర్వహించే వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఇప్పటివరకు డేటా వాడని వినియోగదారులు కూడా బండిల్డ్ రీఛార్జ్ ప్యాక్‌లలో అనవసరంగా మొబైల్ డేటా కోసం అదనపు డబ్బులు చెల్లించాల్సి వచ్చేది. ఇప్పుడు అన్-బండిల్డ్ ప్లాన్లు అందుబాటులోకి రావడంతో, కస్టమర్లు తమ వాడకానికి తగిన రీఛార్జ్‌ను మాత్రమే ఎంచుకుని నెలవారీ ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చు.

శ్వేత

# సంపాదకీయం

**సోమవారం 19-10-2026**

## గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు
# బలమైన పునాది

గ్రామీణ భారతదేశ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమైనది. తెల్లవారుజామునే నిద్రలేచి ఇంటి పనులు పూర్తి చేయడం నుంచి వ్యవసాయ క్షేత్రాల్లో పనిచేయడం వరకు మహిళలు ప్రతిరోజూ అనేక బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. విత్తనాలు నాటడం, కలుపు తీయడం, పంట కోయడం, ధాన్యాన్ని శుభ్రం చేయడం, పశువులను సంరక్షించడం, పాలు సేకరించడం వంటి పనుల్లో వారి శ్రమ ఎంతో విలువైనది. కుటుంబ అవసరాలను తీర్చడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదిగా నిలుస్తున్నారు. అయినప్పటికీ వారి కష్టానికి తగిన గుర్తింపు, ఆర్థిక ప్రతిఫలం, సామాజిక గౌరవం లభిస్తున్నాయా అనే ప్రశ్న నేటికీ సమాజం ముందుంది. అంతర్జాతీయ గ్రామీణ మహిళల దినోత్సవం సందర్భంగా గ్రామీణ మహిళల జీవితాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, సాధికారతకు అవసరమైన చర్యలపై విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉంది. గ్రామీణ మహిళల అభివృద్ధి అంటే ఒక్క కుటుంబం అభివృద్ధి చెందడం మాత్రమే కాదు.. మొత్తం గ్రామీణ సమాజం ముందడుగు వేయడమేనని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

వ్యవసాయ రంగంలో మహిళల శ్రమను పరిశీలిస్తే వారి పాత్ర ఎంత విస్తృతంగా ఉందో అర్థమవుతుంది. పంటల సాగులో అనేక కీలక పనులు మహిళల చేతుల మీదుగానే జరుగుతున్నాయి. వరి నాట్లు వేయడం, పత్తి ఏరడం, మిరపకాయలు కోయడం, కూరగాయల సాగు, పంట ఉత్పత్తులను వేరు చేయడం వంటి పనుల్లో వారు ప్రధాన భాగస్వాములుగా ఉంటున్నారు. వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమ, కోళ్ల పెంపకం, మేకల పెంపకం, చిన్నపాటి కూరగాయల సాగు ద్వారా కుటుంబ ఆదాయానికి తోడ్పడుతున్నారు. అయితే భూమి యాజమాన్య హక్కులు ఎక్కువగా పురుషుల పేర్లపై ఉండటం, వ్యవసాయ రుణాలు పొందడంలో ఇబ్బందులు ఎదురుకావడం, పంట నష్టాల సమయంలో ఆదాయ భద్రత లేకపోవడం వంటి సమస్యలు మహిళలను వెంటాడుతున్నాయి. అనేక సందర్భాల్లో కుటుంబ వ్యవసాయంలో కీలకంగా పనిచేసినా అధికారికంగా రైతులుగా గుర్తింపు పొందలేకపో తున్నారు. మహిళల శ్రమకు తగిన వేతనం అందించడం, భూమి హక్కుల విషయంలో న్యాయం కల్పించడం, వ్యవసాయ సంబంధిత శిక్షణ అందించడం ద్వారా వారి స్థితిగతులను మెరుగుపరచవచ్చు. వ్యవసాయంలో మహిళల భాగస్వామ్యాన్ని గుర్తించి తగిన అవకాశాలు కల్పించినప్పుడే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమవుతుంది.

గ్రామీణ మహిళల జీవితాల్లో ఆర్థిక స్వావలంబన కీలకమైన మార్పును తీసుకురాగలదు. కుటుంబ ఆదాయం కోసం ఇతరులపై ఆధారపడకుండా స్వయంగా సంపాదించే అవకాశం లభిస్తే మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఈ దిశగా స్వయం సహాయక సంఘాలు అనేక ప్రాంతాల్లో మహిళలకు అండగా నిలుస్తున్నాయి. చిన్న మొత్తాల్లో పొదుపు చేయడం, పరస్పర సహకారంతో రుణాలు పొందడం, చిన్న వ్యాపారాలు ప్రారంభించడం ద్వారా కొందరు మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్నారు. పాడిపరిశ్రమలు, కుట్టుపని, ఆహార పదార్థాల తయారీ, చేతివృత్తులు, స్థానిక ఉత్పత్తుల విక్రయాలు వంటి రంగాల్లో శిక్షణతో పాటు మార్కెట్ సదుపాయాలు కల్పిస్తే మరింత ఆదాయం సంపాదించే అవకాశం ఉంటుంది. అయితే రుణాలు తీసుకోవడమే సాధికారతకు పూర్తి పరిష్కారం కాదు. ఆ రుణాలను సద్వినియోగం చేసుకునేలా వ్యాపార నిర్వహణపై అవగాహన, ఉత్పత్తులకు సరైన ధర, విక్రయాలకు మార్కెట్ అనుసంధానం, అవసరమైనప్పుడు సాంకేతిక సహాయం అందాలి. మహిళలు తయారు చేసిన వస్తువులకు మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా కొనుగోలుదారులను చేరుకునే అవకాశాలు పెరగాలి. అప్పుడు వారి కష్టం ఆదాయంగా మారి కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.

గ్రామీణ మహిళలు ఆర్థిక సమస్యలతో పాటు సామాజిక, ఆరోగ్యపరమైన సవాళ్లను కూడా ఎదుర్కొంటున్నారు. తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లడం, ఇంధనం సేకరించడం, పిల్లల సంరక్షణ, వృద్ధుల బాధ్యతలు, ఇంటి పనులు నిర్వహించడం వంటి పనులతో వారి రోజువారీ జీవితం భారంగా మారుతోంది. అనేక మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ కుటుంబ అవసరాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. సరైన పోషకాహారం, వైద్య పరీక్షలు, పరిశుభ్రత, విశ్రాంతి అందకపోవడం వారి ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. బాలికల విద్య, మహిళల భద్రత, బాల్యవివాహాల నివారణ, కుటుంబ నిర్ణయాల్లో మహిళల భాగస్వామ్యం వంటి అంశాలపైనా ప్రత్యేక దృష్టి అవసరం. గ్రామస్థాయిలో ఆరోగ్య సేవలను బలోపేతం చేయడం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించడం, డిజిటల్ అక్షరాస్యత పెంచడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం ద్వారా మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పించవచ్చు. మహిళలు తమ సమస్యలను స్వేచ్ఛగా వెల్లడించగల వాతావరణం ఏర్పడాలి. కుటుంబ సభ్యులు ఇంటి పనులను పంచుకోవడం, మహిళల అభిప్రాయాలకు గౌరవం ఇవ్వడం కూడా సాధికారతలో ముఖ్యమైన భాగాలు.

అంతర్జాతీయ గ్రామీణ మహిళల దినోత్సవం సందర్భంగా మహిళల శ్రమను ప్రశంసించడంతో పాటు వారి జీవితాల్లో వాస్తవమైన మార్పు తీసుకురావడానికి చర్యలు చేపట్టాలి. ప్రభుత్వాలు మహిళా రైతులకు గుర్తింపు కల్పించడం, అవసరమైన రుణాలు, బీమా, శిక్షణ, మార్కెట్ సదుపాయాలను అందించడం, స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేయడం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి.



# కుషాయిగూడలో 'ధీరవ్' మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం



కుషాయిగూడ, అక్టోబర్ 18 (స్టార్ న్యూస్) : కుషాయిగూడలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ధీరవ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి'ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ వేడుకకు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి, ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రవివర్మ, మేనేజింగ్ డైరెక్టర్లు దీప్తి సంగరాజు, ఎం. సుమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు ఆసుపత్రి రిబ్బన్ కట్ చేసి, వైద్య శాలలోని వివిధ విభాగాలను పరిశీలించి నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. స్థానిక ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు తక్కువ ఖర్చుతో, అందుబాటులోకి రావడం ఎంతో సంతోషకరమని నాయకులు పేర్కొన్నారు. నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ఆసుపత్రి కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, ధన్ పాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కే.సీతారాం రెడ్డి, సామల శ్రీనివాస్ రెడ్డి, యాదగిరి గౌడ్, మహమ్మద్ గౌస్ స్థానిక ప్రముఖులు, వైద్య సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# అమ్మవారి మండపాల సందర్శన



కుషాయిగూడ అక్టోబర్ 18 (స్టార్ న్యూస్) : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ గారు, ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి గారు షంషేరా యూత్ అసోసియేషన్, వైష్ణవి ఎంక్లేవ్, హనుమాన్ యూత్ అసోసియేషన్, హనుమాన్ నగర్ కాలనీ జై దుర్గాభవాని అసోసియేషన్, ఎంఎంఆర్ఆర్ కాలనీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఈ రోజు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ వజ్రేష్ యాదవ్ గారు, ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ పరమేశ్వర్ రెడ్డి గారు ముఖ్య అతిథులుగా పాల్గొని, శ్రీ దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అమ్మవారి కటాక్షం ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. దుర్గామాత ఆశీస్సులతో సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యత మరింత పెంపొందాలని కోరుకున్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను, ఆధ్యాత్మిక చైతన్యాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. అనంతరం మండప నిర్వాహకులు వజ్రేష్ యాదవ్, పరమేశ్వర్ రెడ్డిలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీతారామ్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, అజీజ్, విఠల్ నాయక్, సింగిరెడ్డి వికాస్ రెడ్డి, శ్రీహరి, టిల్లు యాదవ్, కాప్రా సాయి గౌడ్, టిల్లు ముదిరాజ్, లింగం, కిషోర్, పూర్ణ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, రాకేష్ యాదవ్, సాకేత్ గౌడ్, చరణ్, నాని స్థానిక నాయకులు, కాలనీ వాసులు, భక్తులు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## హిరణ్యగర్భ మహా నారాయణ సాలగ్రామానికి ప్రథమ వార్షికోత్సవం

మల్కాజ్గిరి ప్రతినిధి, అక్టోబర్ 18: సనాతన హైందవ ధర్మంలో సాలగ్రామానికి అత్యంత విశిష్టమైన స్థానం ఉంది. సాక్షాత్తు శ్రీ మహావిష్ణువు స్వరూపంగా పూజలందుకునే సాలగ్రామమూర్తికి నిత్య దర్శనం, నమస్కారం, అర్చన చేయడం ఎంతో పుణ్యప్రదమని భక్తుల విశ్వాసం. అటువంటి పరమ పవిత్రమైన, అత్యంత పెద్దదైన హిరణ్యగర్భ మహా నారాయణ సాలగ్రామమూర్తి ఆలయంలో కొలువుదీరిన సందర్భంగా ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం నిర్వహించనున్నారు. గత ఏడాది అక్టోబర్ 18న సాలగ్రామమూర్తి ఆలయానికి వేంచేయగా, ఏడాది పూర్తవుతున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



# మా ప్రభుత్వం వస్తే నేనే హోంమంత్రిని

### రెండేళ్లలో వైసీపీ ప్రభుత్వం వస్తుంది

### తొలి 6 నెలలు నేనే హోంమంత్రిని: అంబటి

గుంటూరు: వైసీపీ మేయర్ అభ్యర్థి నామినేషన్ సందర్భంగా మాజీ మంత్రి అంబటి రాంబాబు పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ వైసీపీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మరో రెండేళ్లలో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని అంబటి ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ప్రభుత్వంలో తొలి ఆరు నెలలు తానే హోంమంత్రిగా బాధ్యతలు చేపడతానని, నిబంధనలు ఉల్లంఘించిన వారి లెక్కలు తేలుస్తానని వ్యాఖ్యానించారు. పోలీసులు రాజకీయాలకు అతీతంగా, చట్ట పరిధిలో పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. నామినేషన్ కార్యక్రమం సందర్భంగా అంబటి చేసిన వ్యాఖ్యలు గుంటూరు రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.



# ఆదర్శ రాజకీయం

### నామినేషన్ల కేంద్రంలో ప్రత్యర్థుల ఆత్మీయ ఆలింగనం

### మదనపల్లెలో టీడీపీ, వైసీపీ అభ్యర్థుల ఆత్మీయ పలకరింపు

### అందరికీ ఆదర్శంగా నిలిచిన నేతలు

మదనపల్లె: రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా పలు ప్రాంతాల్లో రాజకీయ ఘర్షణలు, ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్న వేళ ఉమ్మడి చిత్తూరు జిల్లా మదనపల్లెలో భిన్నమైన దృశ్యం కనిపించింది. రాజకీయ వైరుధ్యాలను పక్కనపెట్టి టీడీపీ, వైసీపీ అభ్యర్థులు పరస్పరం ఆత్మీయంగా పలకరించుకోవడం అందరి దృష్టిని ఆకర్షించింది.

టీడీపీ అభ్యర్థి శ్రీరామ్ చిన్నబాబు, వైసీపీ అభ్యర్థి జింక వెంకట చలపతి నామినేషన్ కేంద్రంలో పక్కపక్కనే కూర్చుని తమ నామినేషన్లు దాఖలు చేశారు. అనంతరం ఒకరినొకరు కౌగిలించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రాజకీయంగా ప్రత్యర్థులైనా వ్యక్తిగతంగా స్నేహభావంతో మెలగడం ద్వారా ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలకు తావివ్వకుండా కనబరిచిన ఆత్మీయత.. అందరికీ ఆదర్శంగా నిలిచింది.

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నామినేషన్ల సందర్భంగా ఘర్షణలు, పరస్పర ఆరోపణలు కొనసాగుతున్న నేపథ్యంలో మదనపల్లెలో చోటుచేసుకున్న ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల్లో పోటీ సహజమైనప్పటికీ వ్యక్తిగత సంబంధాలు, పరస్పర గౌరవానికి ప్రాధాన్యమివ్వాలనే సందేశాన్ని ఈ ఇద్దరు అభ్యర్థులు తమ ప్రవర్తనతో చాటిచెప్పారు.



# మహిషాసురమర్దినిగా దుర్గమ్మ దర్శనం

### మహర్నవమి వేళ ఇంద్రకీలాద్రిపై అమ్మవారి దివ్య అలంకారం.. భక్తులకు అభయప్రదానం

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ మహర్నవమి పర్వదినాన శ్రీ మహిషాసురమర్దిని దేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో మహర్నవమికి విశేష ప్రాధాన్యం ఉంది. దుష్టశక్తులపై దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీకగా మహిషాసురమర్దిని అలంకారాన్ని భావిస్తారు. సింహవాహినిగా, చేతుల్లో వివిధ ఆయుధాలను ధరించి మహిషాసురుడిని సంహరించే రూపంలో అమ్మవారిని దర్శించుకోవడం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది. ఈ అలంకారంలో అమ్మవారిని దర్శించుకుంటే ధైర్యం, శక్తి, విజయసిద్ధి కలుగుతాయని భక్తుల విశ్వాసం.

మహిషాసురమర్దిని రూపం శక్తి, ధర్మవిజయం, దుష్టశిక్షణకు ప్రతీకగా నిలుస్తుంది. పురాణాల ప్రకారం మహిషాసురుడి ఆగడాలను అణచివేసేందుకు అమ్మవారు మహిషాసురమర్దిని రూపాన్ని ధరించి సంహరించారు. ఈ రూపంలో అమ్మవారు సింహవాహనంపై ఎనిమిది చేతుల్లో వివిధ ఆయుధాలను ధరించి దర్శనమిస్తారు. మహిషాసురుడిపై అమ్మవారు సాధించిన విజయాన్ని స్మరించుకుంటూ మహర్నవమి రోజున భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దుర్గమ్మను ఆరాధించడం ద్వారా కష్టాలు తొలగి, శత్రువులపై విజయం, సుఖసంతోషాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు.మహర్నవమి సందర్భంగా ఇంద్రకీలాద్రిపై అమ్మవారికి ఆలయ సంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం నిర్వహించిన అనంతరం వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ విశేష అలంకరణలు, అర్చనలు చేపడతారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి, అర్చకులు వేదమంత్రాలతో పూజలు నిర్వహిస్తారు. మహర్నవమి పర్వదినాన అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు విజయవాడతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివస్తారు.మహర్నవమి పూజలతో ఇంద్రకీలాద్రి ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనుంది. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులు ఆలయ నిబంధనలను పాటిస్తూ ప్రశాంతంగా దర్శనం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. శరన్నవరాత్రుల్లో తొమ్మిదో రోజైన మహర్నవమి దుర్గాదేవి ఆరాధనలో అత్యంత ప్రాధాన్యమైనది. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయాన్ని గుర్తుచేసే ఈ పర్వదినాన జగన్మాతను భక్తిశ్రద్ధలతో ఆరాధించి ఆమె కరుణాకటాక్షాలు పొందాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు. మహిషాసురమర్దిని అలంకారంలో దర్శనమిచ్చే కనకదుర్గమ్మను దర్శించుకోవడం తమకు శుభాలను, మనోధైర్యాన్ని ప్రసాదిస్తుందని భక్తుల విశ్వాసం.





# సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### కూటమి అభ్యర్థి విజయానికి బొండా ఉమా ప్రచారం

### కూటమి అభ్యర్థి సాయి కుమార్‌ను గెలిపించాలి: బొండా

### అభివృద్ధి, సంక్షేమానికి ప్రజలు పట్టం కట్టాలి: ఉమా

విజయవాడ, అక్టోబరు 18: విజయవాడ నగరపాలక సంస్థ ఎన్నికల్లో 74వ డివిజన్ ఎన్డీఏ కూటమి అభ్యర్థి గోపి సాయికుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం సాయంత్రం న్యూ రాజరాజేశ్వరి పేటలోని కనకదుర్గ అమ్మవారి ఆలయం నుంచి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని, కూటమి అభ్యర్థికి మద్దతుగా ఓటర్లను అభ్యర్థించారు.

ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు. వృద్ధాప్య పింఛనును రూ.4,000కు, దివ్యాంగుల పింఛనును రూ.6,000కు పెంచడంతో పాటు, అర్హులకు ఇళ్ల పట్టాల పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

సెంట్రల్ నియోజకవర్గంలోని 29 డివిజన్లలో కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలపాలని బొండా ఉమా కోరారు. స్థానిక సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతామని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభ్యర్థి మద్దతుదారులు పాల్గొన్నారు.



# రంగు మారిన గోదావరి జలాలు

### రంగు మారిన గోదావరి జలాలు

### పోలవరం వద్ద గోదావరి జలాల రంగులో మార్పు

### వరద సమయంలో రాగి వర్ణం.. ప్రస్తుతం నీలి రంగులో నీరు

పోలవరం, అక్టోబరు 18: పోలవరం వద్ద గోదావరి నదీజలాల రంగు మారింది. వర్షాకాలంలో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరదతో రాగి వర్ణంలో కనిపించిన జలాలు.. ప్రస్తుతం వరద ఉద్ధృతి తగ్గడంతో నీలి రంగులోకి మారాయి. జూలై నుంచి అక్టోబరు మొదటి వారం వరకు ఎరుపు, గోధుమ ఛాయల్లో కనిపించిన నీరు.. అక్టోబరు మధ్య నాటికి నీలి రంగులో దర్శనమిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో గోదావరిలో వరద ప్రవాహం పెరిగింది. కొండలు, వాగుల నుంచి వచ్చిన నీటితో పాటు మట్టి, ఇసుక రేణువులు నదిలోకి చేరాయి. దీంతో పోలవరం వద్ద జలాలు రాగి రంగులో కనిపించాయి. వర్షాలు తగ్గి వరద ఉద్ధృతి సద్దుమణగడంతో నదిలోకి మట్టి చేరడం తగ్గింది. నీటిలో తేలియాడే మట్టి కణాలు నదీగర్భంలో అవక్షేపాలుగా పేరుకుపోవడంతో జలాలు నీలి రంగులోకి మారాయి.

### తగ్గిన వరద ఉద్ధృతి

అక్టోబరు మధ్య నాటికి గోదావరిలో వరద ప్రవాహం తగ్గింది. ప్రస్తుతం నీటిలో మట్టి కణాల పరిమాణం తగ్గడంతో నదీజలాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. శీలేరు నుంచి గోదావరిలోకి చేరుతున్న నీరు కూడా నీలి రంగులో ఉండటంతో పోలవరం వద్ద ఈ మార్పు కనిపిస్తోంది. వర్షాకాలంలో వరద నీటితో నిండుగా కనిపించిన గోదావరి.. ప్రస్తుతం సాధారణ ప్రవాహ పరిస్థితుల్లో కొనసాగుతోంది. పోలవరం స్పిల్‌వే వద్ద నదీజలాల రంగులో వచ్చిన మార్పు కాలానుగుణంగా మారుతున్న ప్రవాహ పరిస్థితులను ప్రతిబింబిస్తోంది.

### నామినేషన్ల గడువు పొడిగింపు

# పిటిషన్ కొట్టివేత

అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ల గడువు పొడిగించాలని వైసీపీ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. హౌస్ మోషన్ పిటిషన్‌పై న్యాయస్థానం ఆదివారం విచారణ జరిపింది. నామినేషన్ల గడువు ఇప్పటికే ముగిసినందున పిటిషన్ నిరర్థకమైందని న్యాయస్థానం పేర్కొంది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత జోక్యం చేసుకోకూడదన్న గత తీర్పులకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకుంది.




అయితే, ఆయా జిల్లా కేంద్రాల్లో నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని వైసీపీ వేసిన పిటిషన్‌ను డివిజన్ బెంచ్ అనుమతించింది. స్థానికంగా నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డంకులు ఎదురైతే జిల్లా కేంద్రాల్లో నామినేషన్లు వేసుకునే అవకాశం కల్పించాలని వైసీపీ తరపు న్యాయవాది వాదించారు. ఈ అంశంపై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించిన హైకోర్టు, తదుపరి విచారణను వాయిదా వేసింది.



# పలువురు ఎమ్మెల్యే, ఎంపీలను కలసిన మాజీ మంత్రి మాగంటి బాబు

ఏలూరు;అక్టోబర్ 18; పాలకొల్లు లో రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు  ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు,మరియు రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ లను, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, తణుకు ఎమ్మెల్యే ఆరుమెల్లి రాధాకృష్ణ, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ లను ఉమ్మడి రాష్ట్ర మైనర్ ఇరిగేషన్ కేబినెట్ మాజీ మంత్రి మరియు సీనియర్ పార్లమెంటేరియన్ మాగంటి బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. మాగంటి కుటుంబానికి జిల్లా పరిషత్ తో ఉన్న మూడుతరాల అనుబంధాన్ని ప్రస్థావిస్తూ,తన సతీమణి శ్రీమతి మాగంటీ పద్మవల్లీ దేవికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏలూరు జిల్లా పరిషత్ ఛైర్మన్ స్థానానికి కూటమి అభ్యర్థి గా మద్దత్తు కోరారు.మాగంటి బాబు వెంట పలువురు కూటమి వాయకులు ఉన్నారు





# సరస్ మేళా.. ఆత్మవిశ్వాసానికి, ఆర్థిక స్వావలంబనకు వేదిక

## గ్రామీణ మహిళా ఉత్పత్తుల సమాహారానికి చిరునామా.. సంప్రదాయ కళలు, చేనేత, హస్తకళలకు చేయూత.. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

జాతీయస్థాయి సరస్ మేళాను ప్రజలు సద్వినియోగం చేసుకొని గ్రామీణ మహిళల ఉత్పత్తులను ప్రోత్సహించి, కొనుగోలు చేయడం ద్వారా వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడాలని, సంప్రదాయ కళలు, చేనేత, హస్తకళలకు చేయూతనివ్వాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

ఈ నెల 31వ తేదీ వరకు విజయవాడ పున్నమి ఘాట్‌లో జరిగే సరస్ మేళా గ్రామీణ స్వయం సహాయక సంఘాల మహిళల ప్రతిభకు చిరునామాగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఇక్కడ ఉన్న దాదాపు 600 స్టాళ్లలో ఒక్కో స్టాల్ ఒక్కో నైపుణ్యానికి, ప్రతిభకు ప్రతిరూపమని వివరించారు. 50 లైవ్ ఫుడ్‌కోర్ట్స్ ఆహార ప్రియులకు మధురానుభూతులను పంచుతున్నాయన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ.. ఆంధ్రప్రదేశ్ సెర్ప్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ మేళా గ్రామీణ మహిళల నైపుణ్యాలకు, సృజనాత్మకతకు, పారిశ్రామిక సామర్థ్యాలకు జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురావడంతో పాటు వారి ఆర్థిక స్వావలంబనకు బాటలు వేస్తోందన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను ప్రజలకు పరిచయం చేయడానికి, విస్తృత మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఈ మేళా చక్కని వేదికగా నిలుస్తోందని తెలిపారు. ప్రజలు, సందర్శకులు పెద్ద సంఖ్యలో మేళాను సందర్శించి గ్రామీణ మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా వారి జీవనోపాధుల బలోపేతానికి సహకరించాలని పిలుపునిచ్చారు.

### 1999లో ప్రారంభమై అంచెలంచెలుగా ఎదిగి:

1999లో ప్రారంభమైన ఈ కార్యక్రమం క్రమంగా విస్తరించి, దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన గ్రామీణ ఉత్పత్తిదారులు, చేతివృత్తుల కళాకారులు, హస్తకళాకారులు, మహిళా పారిశ్రామికవేత్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ప్రతిష్ఠాత్మక మేళాగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. సరస్ మేళాలో 32 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి దాదాపు 1,500 మంది మహిళా పారిశ్రామికవేత్తల భాగస్వామ్యంతో ప్రత్యేకతలను ప్రతిబింబించే చేనేత వస్త్రాలు, సంప్రదాయ దుస్తులు, హస్తకళా వస్తువులు, గృహాలంకరణ ఉత్పత్తులు, చేతితో తయారుచేసిన వస్తువులు, ఆహార పదార్థాలు, గ్రామీణ ఉత్పత్తులు సందర్శకులను ఆకర్షిస్తున్నాయన్నారు. ఒక్కో ప్రాంతానికి చెందిన కళలు, సంప్రదాయాలు, ఉత్పత్తుల వైవిధ్యాన్ని తెలుసుకునే అవకాశంతో పాటు, వాటిని తయారుచేసే మహిళల శ్రమ, నైపుణ్యం, సృజనాత్మకతను గుర్తించే వేదికగా ఈ మేళా నిలుస్తోందని.. మహిళా స్వయం



సహాయక సంఘాలు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవడానికి, కొత్త మార్కెట్లను చేరుకోవడానికి, వ్యాపార నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి ఇది దోహదపడుతోందన్నారు.

### గ్రామీణ మహిళల శ్రమను ప్రోత్సహించండి:

విజయవాడలో నిర్వహిస్తున్న జాతీయ సరస్ ఆజీవిక మేళాలో తెలుగు హస్తకళల ప్రతిరూపాలు, ఒడిశా కళాఖండాలు, అస్సాం వెదురు బుట్టలు, సంప్రదాయ ఆభరణాలు, జనపనారతో తయారు చేసిన బ్యాగులు, ఇత్తడి కళాఖండాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయన్నారు. ప్రజలు, కుటుంబాలు, యువత, కొనుగోలుదారులు సందర్శించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ కోరారు. గ్రామీణ మహిళలు ఎంతో శ్రమించి తయారుచేసిన చేనేత వస్త్రాలు, చేతివృత్తుల ఉత్పత్తులు, సంప్రదాయ హస్తకళా వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా వారి నైపుణ్యాలను ప్రోత్సహించడంతో పాటు కుటుంబాల ఆదాయ వృద్ధికి ప్రత్యక్షంగా తోడ్పడవచ్చని పేర్కొన్నారు. స్థానిక, గ్రామీణ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సంప్రదాయ కళలు, చేతివృత్తులను పరిరక్షించడంతో పాటు మహిళా పారిశ్రామికవేత్తలకు మరిన్ని అవకాశాలు కల్పించవచ్చని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో మేళాను విజయవంతం చేసి, గ్రామీణ మహిళల ఆత్మవిశ్వాసానికి, స్వావలంబనకు బలమైన మద్దతు అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



# ఓటమి నైరాశ్యంతోనే వైఎస్సార్‌సీపీ దాడులు

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

విజయవాడ, అక్టోబర్ 18 : ఓటమి నైరాశ్యంతోనే వైఎస్సార్‌సీపీ దాడులకు పాల్పడుతోందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు రాష్ట్రంలో సాగిస్తున్న అరాచక దాడులను, హింసా రాజకీయాలను ప్రజలు ఓటుతోనే తిప్పికొడతారని మంత్రి తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో హింసకు, భయాందోళనలకు ఎంతమాత్రం తావు లేదని మంత్రి స్పష్టం చేశారు. ఎన్నికల్లో గెలవలేమని వైఎస్సార్‌సీపీకి ముందుగానే స్పష్టంగా అర్థమైందని, అందుకే తీవ్ర నైరాశ్యంతో ఎన్నికల వేళ ఇలాంటి అరాచకాలకు, దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్ని కుట్రలు పన్నినా, దాడులకు తెగబడ్డా ప్రజలు భయపడే స్థితిలో లేరని, ప్రజాస్వామ్యంలో తమ ఓటు హక్కు ద్వారానే వారికి తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేక వైఎస్సార్‌సీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా అల్లర్లు సృష్టించాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రజలందరూ సంయమనం పాటించి, శాంతిభద్రతలను కాపాడాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలు లేకుండా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి యంత్రాంగం పూర్తి రక్షణ కల్పిస్తుందని మంత్రి భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు మరియు ప్రజలు సంయమనంతో వ్యవహరించి సహకరించాలని పిలుపునిచ్చారు. దాడులు, హింసనే నమ్ముకున్న వైఎస్సార్‌సీపీ సంస్కృతికి ప్రజలు త్వరలోనే తమ ఓటు ద్వారా తగిన తీర్పునిచ్చి ప్రజాస్వామ్య విలువలను గెలిపిస్తారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు.




# శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు

ఏలూరు, అక్టోబర్,18 : స్థానిక ఎన్నికల ప్రక్రియలో శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఏలూరు జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల పర్యవేక్షణకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సాధారణ పరిశీలకులు మరియు రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీస్, బాయిలర్లు, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసుల కార్యదర్శి మిరియాల వెంకట శేషగిరిబాబు అధికారులను ఆదేశించారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఎస్పీ కె. ప్రతాప్ శివకిశోర్ లతో కలిసి ఏలూరు జిల్లా కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో ఆదివారం వివిధ శాఖల జిల్లా అధికారులతో శేషగిరిబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకులు శేషగిరిబాబు మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లాలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి ఆయా ప్రాంతాలలో అదనపు బలగాలతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. నామినేషన్, పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలలో వీడియో చిత్రీకరణతోపాటు, సిసి కెమెరాలు ఏర్పాటుచేయాలన్నారు.

జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. జిలాల్లోని నగరపాలక సంస్థ, పురపాలక సంఘాలలో 130 వార్డులలో ఈనెల 28వ తేదీన పోలింగ్, 30వ తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహించడం జరుగుతుందని, ఇందుకు సంబంధించి ఎన్నికల సిబ్బందికి మొదటివిడత శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని, ఈనెల 23 నుండి 25వ తేదీలోగా రెండవ విడత శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజల నుండి ఫిర్యాదులు నమోదు పరిష్కారం నిమిత్తం జిల్లా కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ జిల్లాలో స్థానిక ఎన్నికలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని, ఏలూరు నగరపాలక సంస్థ, నూజివీడు, జంగారెడ్డిగూడెం పురపాలక సంఘాలలో 376 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసారని, వీటిలో 297 సాధారణం కాగా, 46 సమస్యాత్మకం, 33 అతి సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ లతో అదనపు భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు.

జిల్లా జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె. అభిషేక్ గౌడ, అసిస్టెంట్ కలెక్టర్ సిహెచ్. శ్రావణ్ కుమార్ రెడ్డి, ఇంచార్జ్ డిఆర్ఓ ఎం. ముక్కంటి, జిల్లా పరిషత్ సీఈఓ ఎం. కృష్ణమోహన్, జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు, ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, ఎస్డీసీ దేవకీదేవి, రవాణా శాఖా ఉప కమీషనర్ కరీం , ఆర్టీఓ శేఖర్, డీఈఓ వెంకటలక్ష్మమ్మ, ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ ఏ .భానుప్రతాప్, డిఎస్పీ శ్రావణ్ కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ జెడ్.రమేష్, స్వర్ణగ్రామ,వార్డ్ నోడల్ అధికారి జి.వెంకటనాయుడు, ఎల్డిఎమ్ సత్యనారాయణ, మెప్మా పిడి రాజబాబు, సాంఘిక సంక్షేమ శాఖ జెడి విశ్వమోహన్ రెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం షబ్నమ్, గృహ నిర్మాణ శాఖ అధికారి సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




# ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులుగా ఎం.శివకుమార్, ఐఎఫ్ఎస్ నియామకం

విజయవాడ: అక్టోబర్ 18,2026: రాష్ట్రంలో అక్టోబర్, నవంబర్, డిసెంబర్ 2026 నెలల్లో నిర్వహించనున్న స్థానిక సంస్థలు ఆయన పట్టణ స్థానిక సంస్థలు, ఎంపీటీసీ, జెడ్పీటిసి, గ్రామ పంచాయతీలు సాధారణ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులుగా ఏపీఎస్ఆర్టీసీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.శివకుమార్, ఐఎఫ్ఎస్ ని నియమిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశా ను ఆదివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నందు జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎం.శివకుమార్ మర్యాదపూర్వకంగా కలుసుకొని స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై చర్చించడం జరిగింది.

జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎం.శివకుమార్ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు తమ రోజువారీ ఖర్చులు, బ్యాంకు ఖాతా లావాదేవీలకు సంబంధించి నిర్వహించే ఎన్నికల వ్యయ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా తనిఖీ చేసి పర్యవేక్షించడం, ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలు, వ్యయ పరిమితులను ఏ అభ్యర్థి కూడా ఉల్లంఘించకుండా క్షేత్రస్థాయిలో కట్టుదిట్టమైన నిఘా ఉంచడం, జిల్లావ్యాప్తంగా పర్యటిస్తూ అభ్యర్థులు నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభలు, ప్రచార వాహనాలు, ప్రచార సామగ్రి (ఫ్లెక్సీలు, పోస్టర్లు తదితర) ఖర్చులను గుర్తించి, అధికారికంగా సమర్పించే లెక్కలతో సరిపోల్చడం జరుగుతుంది. అలాగే ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు వ్యయ పరిశీలన పురోగతి, అభ్యర్థుల ఖర్చుల వివరాలపై ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘం నిర్దేశించిన అధికారిక ఇమెయిల్ శీఎంవతీజవతీం.ఖజూంవషఏస్త్రమ్ఝ అశ్రీ.షశీఎ ద్వారా రాష్ట్ర ఎన్నికల సంఘానికి నేరుగా నివేదికలను సమర్పించనున్నారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు జరిగే నగదు, బహుమతులు, మద్యం పంపిణీలను అడ్డుకునేందుకు జిల్లా స్థాయి ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లు, వీడియో సర్వైలెన్స్ టీమ్‌లు, అకౌంటింగ్ బృందాలతో సమన్వయం చేసుకోవడం జరుగుతుంది.



# విజయనగరం మేయర్ అభ్యర్థిగా అవనాపు భార్గవి నామినేషన్ దాఖలు

విజయనగరం, అక్టోబర్ 18: విజయనగరం నగరపాలక సంస్థ మేయర్ పదవికి కూటమి పార్టీ అభ్యర్థిగా అవనాపు భార్గవి నామినేషన్ దాఖలు చేశారు.

శనివారం ఉదయం ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, పైడితల్లి దేవస్థానం నుండి మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అనంతరం మున్సిపల్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి అవనాపు భార్గవి తన నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మీవీజు, రాజు-్రా, చీ=× సాధికారత శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కూటమి నేతలు పాల్గొన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కామెంట్స్‌లి..మాట్లాడుతూ, విజయనగరం పట్టణంలో అవనాపు కుటుంబానికి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్నది..నిత్యం ప్రజలతో మమేకమై ఉండే కుటుంబం అవనాపు వారి కుటుంబం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన అనేక పథకాల ద్వారా విజయనగరం పట్టణాన్ని విస్తృతంగా అభివృద్ధి చేస్తున్నాం.. పట్టణంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యలు నేడు పరిష్కార దిశగా వెళుతున్నాయి..కూటమి పార్టీ తరపున బలపరిచిన మేయర్ అభ్యర్థికి పట్టణ ప్రజలు ఘన విజయం అందించాలి.. నేడు యువ నాయకులు ముందుకు రావడం సంతోషంగా ఉన్నది.. నగర ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం.. నగరానికి ప్రస్తుతం 20 మీణ తాగునీటి అవసరం ఉండగా, 10 మీణ మాత్రమే సరఫరా అవుతోందని, మిగిలిన కొరతను తీర్చేందుకు శాశ్వత ప్రణాళికలు రూపొందిస్తున్నాం.. తాగునీటి నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడబోము.. తరచూ విద్యుత్ అంతరాయాలు లేకుండా ఉండేందుకు కొత్త సబ్-స్టేషన్ ఏర్పాటు చేసి, పవర్ కనెక్షన్ వ్యవస్థను పటిష్టం చేశాము..

### సైబర్ క్రైమ్ చేతికి చిక్కిన 'డిజిటల్ అరెస్ట్' మోసగాళ్లు

# ఇద్దరు నిందితుల అరెస్టు




**అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్**

'డిజిటల్ అరెస్ట్' మోసానికి పాల్పడిన ఇద్దరు నిందితులను హైదరాబాద్ నగర సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ నిందితులు 'మ్యూల్' (ఎబక్రీవ) బ్యాంక్ ఖాతాలను ఏర్పాటు చేయడంలో, మోసపూరిత పద్ధతుల్లో పొందిన నగదును డ్రా చేయడంలో మరియు ఆ డబ్బును వివిధ బ్యాంక్ ఖాతాల్లోకి మళ్లించడం ద్వారా లావాదేవీల జాడను (money trail) కప్పిపుచ్చడంలో కీలక పాత్ర పోషించారు. అంతేకాకుండా, సైబర్ నేరగాళ్లతో కలిసి ఖూణు (డిజిటల్ కరెన్సీ) లావాదేవీలను నిర్వహించడంలో సహకరించి, అందుకు ప్రతిఫలంగా కమిషన్లు పొందారు.

కేసు నమోదు: క్రైమ్ నంబర్ 568/2025; ఐటీ చట్టంలోని సెక్షన్లు 66(జ), 66(ణ) మరియు బీఎన్ఎస్ (దీఛీూ) చట్టంలోని సెక్షన్లు 111(2)(ఎ), 318(4), 319(2), 336(3), 338, 340(2) కింద కేసులు నమోదు చేయబడ్డాయి.

అరెస్టు చేసిన నిందితుల వివరాలు:

A>1 మహ్మద్ అష్ఫాక్ హుస్సేన్, తండ్రి: ముస్తాక్ హుస్సేన్, వయస్సు: 27 ఏళ్లు, వృత్తి: వ్యాపారం, నివాసం: అమీర్‌పేట, హైదరాబాద్.

A>2 అహ్మద్ నజీబ్ ఉద్దీన్, తండ్రి: మహ్మద్ అహ్మద్ ఉద్దీన్, వయస్సు: 27 ఏళ్లు, వృత్తి: వ్యాపారం, నివాసం: అమీర్‌పేట, హైదరాబాద్.

A>3 సచిన్, నివాసం: బెంగళూరు (పరారీలో ఉన్నాడు).

కేసు వివరాలు: 03.03.2025న, 63 ఏళ్ల రిటైర్డ్ ఉద్యోగికి గుర్తుతెలియని వ్యక్తుల నుండి ఫోన్ కాల్స్ వచ్చాయి. వారు తమను తాము ఢిల్లీ పోలీసులు, సీబీఐ (CBI) మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (జుణ) అధికారులమని పరిచయం చేసుకున్నారు. బాధితుడు రూ. 6.8 కోట్ల (68 మిలియన్ల) మనీ లాండరింగ్ కేసులో నిందితుడిగా ఉన్నాడని నమ్మించి, అతడిని అరెస్టు చేస్తామని బెదిరించారు. తమ మాటలను నిజమని నమ్మించేందుకు, వారు నకిలీ అధికారిక పత్రాలను పంపారు. అంతేకాకుండా, బాధితుడి ఆధార్ వివరాలు మరియు వేలిముద్రలను ఈ నేరంలో దుర్వినియోగం చేశారని అబద్ధపు ఆరోపణలు చేశారు. నిందితులు బాధితుడి వ్యక్తిగత మరియు బ్యాంకింగ్ వివరాలను సేకరించి, 'వెరిఫికేషన్' (ధృవీకరణ) పేరుతో అతడిని మరియు అతని కుమార్తెను డబ్బు బదిలీ చేసేలా ప్రేరేపించారు. ఆ డబ్బు తిరిగి ఇచ్చేస్తామని నమ్మబలికారు. అంతేకాకుండా, వారిని అరెస్టు చేస్తామని బెదిరించి, జాతీయ భద్రత దృష్ట్యా ఈ విషయాన్ని ఎవరికీ చెప్పకుండా రహస్యంగా ఉంచాలని ఆదేశించారు. వారి మాటలను నమ్మిన బాధితుడు మరియు అతని కుమార్తె మొత్తం 29,17,668/- నగదును బదిలీ చేశారు. డబ్బు తిరిగి రాకపోవడంతో, తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయబడింది.

నిందితుల అరెస్టు: దర్యాప్తులో సేకరించిన సాంకేతిక ఆధారాల మేరకు, 17-10-2026న ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె. నారాయణ రెడ్డి మరియు ఆయన బృందం ఇద్దరు నిందితులను--- మొహమ్మద్ అష్ఫాక్ హుస్సేన్ (ూా-1) మరియు అహ్మద్ నజీబ్ ఉద్దీన్ (ూా-2)---హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో అదుపులోకి తీసుకున్నారు. వారిని తదుపరి విచారణ నిమిత్తం హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ూా-1 మరియు ూా-2లు, బెంగళూరుకు చెందిన సచిన్ (ూా-3) అనే వ్యక్తితో వాట్సాప్ ద్వారా పరిచయం ఏర్పరుచుకున్నట్లు తేలింది. 'డిజిటల్ అరెస్ట్' మోసాల ద్వారా బాధితుల నుంచి సేకరించిన డబ్బును, దర్యాప్తు సంస్థలకు దొరకకుండా ఉండేందుకు, ూా-3 ఒక పథకాన్ని రూపొందించాడు. దీని ప్రకారం, బాధితుల నుంచి వచ్చిన డబ్బును వివిధ బ్యాంక్ ఖాతాల ద్వారా మళ్లించి, 'క్యాష్ డిపాజిట్ మెషీన్ల' (జణవీ) ద్వారా నగదును జమ చేసేవారు. ఈ ప్రణాళికలో భాగంగా, A-1 నిందితుడు A-2నుంచి బ్యాంక్ ఖాతా వివరాలను సేకరించి A-3కి పంపాడు. ఆ తర్వాత, మోసపూరితంగా పొందిన డబ్బును A>3, A అందించిన బ్యాంక్ ఖాతాలోకి బదిలీ చేశాడు. A-3 dYÖ#áq\ మేరకు, ూా-1 మరియు ూా-2లు ఆ డబ్బును చెక్కుల ద్వారా డ్రా చేసి, జణవీల ద్వారా వేర్వేరు బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. ఆ తర్వాత, ఆ నగదుతో ూా-3 'ఖూణు' క్రిప్టోకరెన్సీని కొనుగోలు చేసి, దానిని ఆన్‌లైన్‌లో విక్రయించి తిరిగి భారతీయ రూపాయలుగా మార్చుకున్నాడు. ఈ లావాదేవీలకు సహకరించినందుకు, ూా-1 మరియు ూా-2లకు ూా-3 నుంచి కమీషన్లు అందాయి. అరెస్టు సమయంలో, నిందితులైన ూా-1 మరియు ూా-2ల వద్ద ఉన్న రెండు ఆపిల్ ఐఫోన్‌లను సైబర్ క్రైమ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మోసపూరిత కార్యకలాపాలకు సంబంధించి భారతదేశవ్యాప్తంగా సుమారు 16 కేసులు నమోదైనట్లు విచారణలో వెల్లడైంది.

అరెస్టు చేసిన నిందితులను హైదరాబాద్‌లోని సంబంధిత కోర్టులో హాజరుపరిచారు. పరారీలో ఉన్న నిందితులను గుర్తించి పట్టుకోవడానికి, ఆర్థిక లావాదేవీలను పరిశీలించడానికి మరియు ఈ మోసంతో సంబంధం ఉన్న ఇతర వ్యక్తుల ప్రమేయాన్ని గుర్తించడానికి తదుపరి విచారణ కొనసాగుతోంది.

ఈ ఆపరేషన్ హైదరాబాద్ సిటీ, సీసీఎస్ (CCS), డీడీ (ఐఐ) విభాగం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీ ఎస్. చైతన్య కుమార్, ఐపీఎస్ (IPS) గారి మార్గదర్శకత్వంలో, హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీ ఆర్. జి. శివ మారుతి గారి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగింది. ఈ బృందంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీ కె. నారాయణ రెడ్డి, ఎస్.ఐ.లు మోన్‌మోహన్ గౌడ్, జి. శివకుమార్ మరియు వారి సిబ్బంది పాల్గొన్నారు.



## నీటి వినియోగంపై అదానీ-గూగుల్ కీలక నిర్ణయం

వైజాగ్, అక్టోబర్ 18 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌ను కీలక డేటా హబ్‌గా మార్చే దిశగా చేపట్టిన ప్రాజెక్టులలో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నారు. విశాఖపట్నంలో అదానీ కనెక్స్, గూగుల్ సంయుక్తంగా నిర్మిస్తున్న భారీ డేటా సెంటర్లలో నీటి వినియోగాన్ని గణనీయంగా తగ్గించేందుకు అత్యాధునిక ఎయిర్-కూల్డ్ టెక్నాలజీని ఉపయోగించనున్నట్లు సంస్థ ప్రకటించింది. ముదసర్లోవ, తర్లువాడ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న ఈ క్యాంపస్‌లలో ఈ కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు. సాధారణంగా డేటా సెంటర్ల నిర్వహణకు, కూలింగ్ వ్యవస్థలకు భారీ పరిమాణంలో మంచినీరు అవసరమవుతుంది. ర

అయితే, దీనికి భిన్నంగా ఎయిర్-కూలింగ్ టెక్నాలజీని వాడటం ద్వారా నీటి అవసరాన్ని దాదాపుగా తొలగించనున్నారు. ఈ ప్రాజెక్టులన్నింటిలో కలిపి మొత్తం మంచినీటి వినియోగం ఒక ఒలింపిక్ స్విమ్మింగ్ పూల్ పరిమాణం కంటే తక్కువగానే ఉంటుందని అంచనా. ఇందులో కూడా 80 శాతం నీటిని కేవలం ఉద్యోగుల సౌకర్యాలు, వంటగదులు, పచ్చదనం పెంపకం వంటి అవసరాలకే కేటాయించనున్నారు. ఈ ప్రాజెక్టులు ముదసర్లోవ రిజర్వాయర్, కంబాలకొండ వన్యప్రాణుల అభయారణ్యం సమీపంలో ఉండటంతో నీటి వనరులపై ప్రభావం చూపుతాయనే ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో, గృహ అవసరాలకు వినియోగించే నీటి వనరులపై ఆధారపడకుండా, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ వాటర్ కనెక్షన్ల ద్వారానే నీటిని సేకరించనున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది. అంతేకాకుండా, 'జీరో-డిశ్చార్జ్' విధానాన్ని పాటిస్తూ, ప్రాజెక్టులో వెలువడే మురుగునీటిని ఆన్‌సైట్ ప్లాంట్‌లో శుద్ధి చేసి, ఇరిగేషన్, ఫ్లషింగ్ వంటి అవసరాలకు తిరిగి వినియోగిస్తారు. శుద్ధి చేసిన నీటిని కూడా ముదసర్లోవ రిజర్వాయర్‌లోకి వదిలే ప్రసక్తే లేదని హామీ ఇచ్చారు. అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఎడ్జ్‌కనెక్స్ సంస్థల జాయింట్ వెంచరే ఈ అదానీ కనెక్స్. గూగుల్‌తో కలిసి దాదాపు 1 గిగావాట్ సామర్థ్యంతో హైపర్‌స్కేల్ డేటా సెంటర్లను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ సంస్థ పనిచేస్తోంది. ఈ ప్రాజెక్టులతో పాటు రిలయన్స్, ఎయిర్‌టెల్ వంటి సంస్థల కార్యకలాపాలతో విశాఖపట్నం త్వరలో దేశంలోనే ఒక ముఖ్యమైన డేటా సెంటర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్‌గా మారనుంది.

## ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

### ఏపీ గవర్నర్‌కు వినతి

అమరావతి, అక్టోబర్ 18 (ఈవార్తలు): ఏపీలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను కోరారు. ఆదివారం ఆయన రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార కూటమి అప్రజాస్వామిక పద్ధతులకు పాల్పడుతోందని, ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. సమావేశం అనంతరం జగన్ మీడియాలో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇంతటి అప్రజాస్వామిక వాతావరణాన్ని తానెప్పుడూ చూడలేదని అన్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం కేంద్ర బలగాల పర్యవేక్షణలో, సీసీటీవీ కెమెరాల నిఘాలో జరిపేలా చూడాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. వైసీపీ అభ్యర్థులను నామినేషన్ కేంద్రాల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని, అదే సమయంలో టీడీపీ మద్దతుదారులను లోపలికి అనుమతించి దాడులు చేయిస్తున్నారని గవర్నర్‌కు వివరించినట్లు చెప్పారు. ఈ అరాచకాలకు పోలీసులు కూడా అధికారపక్షానికే మద్దతుగా నిలుస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని 8 ప్రాంతాల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని, మరో 19 చోట్ల కేవలం 36 శాతం నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకో 8 ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను చించివేశారని తెలిపారు. పులివెందులలో 36 వార్డులకు గాను కేవలం 19 నామినేషన్లు మాత్రమే దాఖలు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద వైసీపీ ఎంపీలు అవినాశ్ రెడ్డి, మిథున్ రెడ్డి, గురుమూర్తి పట్ల వ్యవహరించిన తీరు, అభ్యర్థులపై పోలీసుల కాల్పులు, తప్పుడు కేసులు బనాయించడం వంటి అంశాలను కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. క్రియాశీలకంగా ఉన్న వైసీపీ కార్యకర్తలను భయపెట్టేందుకు బైండోవర్ కేసుల కుట్ర జరుగుతోందని జగన్ ఆరోపించారు.

## ఏపీలో మున్సిపల్.. నామినేషన్ల గడువు క్లోజ్

**చివరి రోజు భారీగా తరలివచ్చిన అభ్యర్థులు**

విజయవాడ, అక్టోబర్ 18: ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ ముగిసింది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు నామినేషన్లు దాఖలు చేసేందుకు విధించిన గడువు ఆదివారం (అక్టోబర్ 18) మధ్యాహ్నం 3 గంటలతో ముగిసింది. చివరి రోజు కావడంతో రాష్ట్రవ్యాప్తంగా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలు అభ్యర్థులు, వారి మద్దతుదారులతో కిటకిటలాడాయి. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయానికి కార్యాలయ ప్రాంగణాల్లో ఉన్న వారందరికీ అధికారులు టోకెన్లు జారీ చేసి, వారి నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీతో పాటు స్వతంత్ర అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో పురపోరు రసవత్తరంగా మారనుంది.

**దర్శిలో వైసీపీకి ఎదురుదెబ్బ**

ప్రకాశం జిల్లా దర్శిలో వైసీపీకి ఊహించని పరిణామం ఎదురైంది. గడువు ముగియడంతో దాదాపు 25 మంది వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేకపోయారు. సమయానికి కార్యాలయానికి చేరుకోలేకపోవడంతో వారు నిరాశగా వెనుదిరగాల్సి వచ్చింది. ఈ పరిణామం స్థానికంగా చర్చనీయాంశమైంది.

**తదుపరి షెడ్యూల్ ఇదే**

నామినేషన్ల పర్వం ముగియడంతో ఎన్నికల సంఘం తదుపరి ప్రక్రియపై దృష్టి సారించింది. షెడ్యూల్ ప్రకారం, రేపు (అక్టోబర్ 19) నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. అక్టోబర్ 21 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు. ఉపసంహరణల గడువు ముగిసిన తర్వాత బరిలో నిలిచే తుది అభ్యర్థులపై స్పష్టత రానుంది. అక్టోబర్ 28న పోలింగ్ జరగనుండగా, అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడిస్తారు.

## పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలి

**సీఎం రేవంత్‌కు బండ్ల గణేశ్ విజ్ఞప్తి**

హైదరాబాద్, అక్టోబర్ 18: పౌల్ట్రీ పరిశ్రమ ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై తక్షణమే స్పందించి, రైతులను ఆదుకోవాలని ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఈరోజు ఆయన ముఖ్యమంత్రిని ఉద్దేశించి ఒక ప్రకటన చేశారు. పౌల్ట్రీ పరిశ్రమకు కీలకమైన మొక్కజొన్న, సోయాబీన్, డీఓసీ వంటి ముడిసరుకులను కొందరు స్టాకిస్టులు అక్రమంగా గోదాముల్లో నిల్వ చేస్తున్నారని బండ్ల గణేశ్ ఆరోపించారు. దీనివల్ల మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టించి, ధరలను అమాంతం పెంచుతున్నారని ఆయన పేర్కొన్నారు.

## ఆర్టీసీలో గెలిచినా దక్కని గుర్తింపు!

హైదరాబాద్, అక్టోబర్ 18: టీజీఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన తమకు ధ్రువీకరణ పత్రం (విక్టరీ సర్టిఫికెట్) అందజేయడంలో కార్మిక శాఖ జాప్యం చేస్తోందని టీజీఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆరోపించింది. ఎన్నికల్లో గెలుపొందిన తమకు వెంటనే సర్టిఫికెట్ జారీ చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ నేతలు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల జరిగిన ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ), తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ), నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ)లతో కూడిన జేఏసీ కూటమి ఘన విజయం సాధించింది. అయితే, ఎన్నికల ఫలితాలు వెలువడి అనేక రోజులు గడుస్తున్నా కార్మిక శాఖ అధికారులు ధ్రువీకరణ పత్రం ఇవ్వకుండా అనవసరంగా ఆలస్యం చేస్తున్నారని జేఏసీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచే కార్మిక శాఖ అధికారులు తమకు అడ్డంకులు సృష్టిస్తున్నారని జేఏసీ నేతలు తమ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయంలో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి వెంటనే జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని జేఏసీ విజ్ఞప్తి చేసింది.

# జర్మనీ ఉద్యోగాల పేరిట టాంకామ్ భారీ మోసం

**ఒక్క ఉద్యోగం లేదు.. రూ.కోట్లలో వసూళ్లు.. 70 మంది యువకుల నుంచి ఒక్కొక్కరి దగ్గర రూ.4.5 లక్షల వరకు వసూలు**

**టాంకామ్‌పై మాజీమంత్రి హరీశ్ రావు ఫైర్**

హైదరాబాద్, అక్టోబర్ 18 : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రభుత్వ ఆధ్వర్యంలోని టాంకామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ) నిరుద్యోగ యువతను దోచుకునే ఓ పెద్ద రాకెట్‌గా మారిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. జర్మనీలో ఉద్యోగాల పేరు చెప్పి 70 మందికి పైగా యువకుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి, వారిని నట్టేట ముంచారని సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హరీశ్ రావు ఆరోపణల ప్రకారం, సుమారు 15 జిల్లాల నుంచి 70-75 మంది నిరుద్యోగ యువకుల నుంచి టాంకామ్ ఒక్కొక్కరి దగ్గర రూ. 4.10 లక్షల చొప్పున వసూలు చేసింది. పరీక్షలు, ఇన్సూరెన్స్, వీసా ఖర్చులతో కలిపి ఇది ఒక్కో అభ్యర్థికి దాదాపు రూ. 4.5 లక్షలకు చేరిందని ఆయన వివరించారు. పేద రైతు కుటుంబాలకు చెందిన వారు తమ ఇంట్లోని మహిళల బంగారాన్ని తాకట్టు పెట్టి, అప్పులు చేసి ఈ డబ్బు కట్టారని, రెండేళ్లు గడిచినా ఉద్యోగాలు రాకపోవడంతో ఇంకా వడ్డీలు చెల్లిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లు దాటినా, బాధితుల్లో ఒక్కరిని కూడా ఒక్క జర్మన్ కంపెనీ కూడా ఇంటర్వ్యూ చేయలేదని హరీశ్ రావు తెలిపారు. జర్మన్ భాషలో బీ1 పరీక్ష పాసైన వారిని, ఇప్పుడు బీ2 పాస్ కావాలని చెప్పి కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. వీరిలో తొమ్మిది మంది జర్మనీకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారంటూ టాంకామ్ ప్రచారం చేసుకున్నా, ఒక్కరు కూడా వెళ్లలేదని స్పష్టం చేశారు. ఈ అభ్యర్థులతో కుదుర్చుకున్న ఒప్పందంలో ఏదైనా వివాదం తలెత్తితే 1,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్నో కోర్టులో తేల్చుకోవాలని నిబంధన పెట్టడం దారుణమని అన్నారు. టాంకామ్ ద్వారా ఇప్పటివరకు ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయో చెప్పాలని ఆర్టీఐ ద్వారా అడిగినా, గడువు ముగిసినా సమాధానం ఇవ్వడం లేదని విమర్శించారు. బాధితులు రెండేళ్లుగా ఎదురుచూస్తుంటే, ఈ ఏడాది జూన్‌లో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కొత్త టాంకామ్ బ్యాచ్‌ను ప్రారంభించి ఉద్యోగ హామీలు ఇవ్వడం బాధితులను అవమానించడమేనని హరీశ్ రావు దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. ఈ మోసానికి పాల్పడిన టాంకామ్, ఫెయిర్‌స్టేట్ ఇండియా సంస్థల నుంచి వసూలు చేసిన ప్రతి రూపాయిని బాధితులకు తిరిగి చెల్లించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. వారు కోల్పోయిన రెండేళ్ల కాలానికి, వడ్డీ భారం, మానసిక వేదనకు నష్టపరిహారం అందించాలన్నారు. బాధితులందరికీ ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని, ఈ వ్యవహారంపై తక్షణమే సీఐడీ లేదా జ్యుడీషియల్ విచారణ జరిపి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఫీజుల వసూళ్లు, కల్పించిన ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హరీశ్ రావు తన పోస్టులో స్పష్టం చేశారు.





# ప్రియాంశ్ ఆర్య డబుల్ సెంచరీ మిస్

రంజీ ట్రోఫీలో ఢిల్లీ ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య (ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ విధ్వంసకర బ్యాటర్)కు గుండెకోత మిగిలింది. గుజరాత్‌తో ఇవాళ ప్రారంభమైన మ్యాచ్‌లో అతడు ఒక్క పరుగు తేడాతో డబుల్ సెంచరీ మిస్ అయ్యాడు. ఈ విషయం అతడితో పాటు అతడి అభిమానులకు తీవ్ర నిరాశ కలిగించింది. సోషల్‌మీడియాలో ప్రియాంశ్‌పై సానుభూతి పెల్లుబుకుతోంది. అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు.. డబుల్ సెంచరీకి అర్హుడంటూ కామెంట్ల వర్షం కురుస్తోంది. గత ఐపీఎల్ సీజన్‌లోనూ ప్రియాంశ్ ఓ మ్యాచ్‌లో అర్హమైన సెంచరీని చేజార్చుకున్నాడు. న్యూ ఛండీఘఢ్‌తో లక్నోతో జరిగిన మ్యాచ్‌లో అతడు 37 బంతుల్లో 93 పరుగుల వద్ద ఔటయ్యాడు. మొత్తంగా రంజీ ట్రోఫీ 2026-27 రెండో రౌండ్ మ్యాచ్‌ల తొలి రోజు ప్రియాంశ్ డబుల్ సెంచరీ మిస్ అంశం హైలైట్ అయ్యింది. మ్యాచ్ విషయానికొస్తే.. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న ఢిల్లీ భారీ స్కోర్ దిశగా సాగుతోంది. ప్రియాంశ్ తృటిలో డబుల్ సెంచరీ మిస్ (220 బంతుల్లో 199; 24 ఫోర్లు, 6 సిక్సర్లు) చేసుకోగా.. కెప్టెన్ ఆయుశ్ బదోని (115) అజేయ శతకంతో క్రీజ్‌లో ఉన్నాడు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఢిల్లీ స్కోర్ 381-4గా ఉంది. బదోనికి జతగా సుమిత్ మాథుర్ (0) క్రీజ్‌లో ఉన్నాడు. గుజరాత్ బౌలర్లలో హర్షల్ పటేల్ 2, మనన్ హింగ్రాజియా ఓ వికెట్ పడగొట్టగా.. ఆయుశ్ దోసేజా (29) రనౌటయ్యాడు.



# వైభవ్ విషయంలో గంభీర్ తప్పుచేశాడు!

టీమిండియా యువ సంచలనం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి నిరీక్షణ తప్పడం లేదు. వెస్టిండీస్‌తో ఇటీవల ముగిసిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో జట్టుకు ఎంపికైనప్పటికీ, అతనికి ఒక్క మ్యాచ్‌లో కూడా ఆడే అవకాశం రాలేదు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. వైభవ్ మరికొంత కాలం వేచి చూడాల్సిందేనని పరోక్షంగా సంకేతాలిచ్చారు. ఈ నిర్ణయం ఇప్పుడు భారత క్రికెట్ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ప్రస్తుతం జట్టులో స్థిరపడిన ఓపెనింగ్ జోడీ అభిషేక్ శర్మ, సంజూ శాంసన్‌లకే యాజమాన్యం ప్రాధాన్యత ఇచ్చింది. ఫామ్‌లో ఉన్నంత మాత్రాన తుది జట్టులో చోటు దక్కుతుందని భావించకూడదని, సీనియర్ ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం, భద్రతాభావం కల్పించడం ముఖ్యమని కోచ్ గంభీర్ గతంలోనే వైభవ్‌కు వివరించినట్లు తెలుస్తోంది. నిలకడగా రాణిస్తున్న ఆటగాళ్లకే తమ మొదటి ప్రాధాన్యత అని యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ పరిణామం మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ నాయకత్వ శైలిని గుర్తుకు తెస్తోంది. ముఖ్యంగా ఎంఎస్ ధోనీ విషయంలో గంగూలీ అనుసరించిన వైఖరికి, గంభీర్ వ్యూహానికి మధ్య ఉన్న తేడాపై విశ్లేషణలు మొదలయ్యాయి. ధోనీ తన అంతర్జాతీయ కెరీర్ ఆరంభంలో తొలి నాలుగు ఇన్నింగ్స్‌లలో విఫలమైనప్పటికీ, గంగూలీ అతనిపై నమ్మకం ఉంచి వరుస అవకాశాలు కల్పించాడు. ఆ నమ్మకాన్ని నిలబెడుతూ ధోనీ పాకిస్థాన్‌పై 148 పరుగుల కీలక ఇన్నింగ్స్‌తో చెలరేగి తన కెరీర్‌ను గొప్పగా మలుచుకున్నాడు. ఒక ఆటగాడిని ఎంపిక చేశాక, వారిపై ఒత్తిడి తగ్గించి సహజంగా రాణించేందుకు కనీసం పది మ్యాచ్‌లైనా అవకాశాలు ఇవ్వాలన్నది గంగూలీ సిద్ధాంతం. ప్రతిభావంతులైన యువకులకు అండగా నిలబడితేనే వారు భవిష్యత్ స్టార్లుగా ఎదుగుతారని దాదా బలంగా నమ్మేవాడు. ఇప్పుడు టీమిండియా తదుపరి న్యూజిలాండ్‌లో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌లోనైనా వైభవ్ సూర్యవంశీకి యాజమాన్యం అవకాశం ఇస్తుందా? లేక గంభీర్ తన వ్యూహానికే కట్టుబడి ఉంటాడా? అనేది ఆసక్తికరంగా మారింది.







# జింబాబ్వేపై టీమిండియా విన్

## స్మృతి మంధాన మెరుపు ఫినిషింగ్

**జింబాబ్వేతో రెండో టీ20లో భారత మహిళల జట్టు అదరగొట్టింది. తొలుత బౌలింగ్‌లో ప్రత్యర్థిని కట్టడి చేసిన టీమిండియా.. ఆ తర్వాత బ్యాటింగ్‌లో విధ్వంసం సృష్టించింది. ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధాన ఆకాశమే హద్దుగా చెలరేగడంతో స్వల్ప లక్ష్యాన్ని భారత్ కేవలం 8.5 ఓవర్లలోనే ఛేదించింది.**

షఫాలీ వర్మ 25 బంతుల్లో 55 పరుగులతో విరుచుకుపడగా.. కెప్టెన్ స్మృతి మంధాన 23 బంతుల్లో 40 పరుగులతో మెరిపించింది. మొదట బ్యాటింగ్ చేసిన జింబాబ్వే మహిళల జట్టు భారత బౌలర్ల ధాటికి నిర్ణీత 20 ఓవర్లలో సుమారు 100 పరుగులకే పరిమితమైంది.

ఆ జట్టు బ్యాటర్లలో చిపో ముగేరి-తిరిపానో 32 బంతుల్లో 34 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచింది. జోసెఫిన్ న్కోమో 29 బంతుల్లో 24 పరుగులతో పోరాడింది. అయితే మిగతా బ్యాటర్లు భారీ స్కోరు చేయడంలో విఫలమయ్యారు. భారత బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు తీస్తూ జింబాబ్వేను ఒత్తిడిలోకి నెట్టారు. దీప్తి శర్మ బెలవ్డ్ బిజాను ఔట్ చేయగా.. నందిని శర్మ కూడా వికెట్ సాధించింది. యువ క్రికెటర్ నికి ప్రసాద్ తన అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి బంతికే వికెట్ తీసి ఆకట్టుకుంది. చిపో ముగేరి-తిరిపానోను రిచా ఘోష్ క్యాచ్ పట్టడంతో నికి ప్రసాద్‌కు తొలి వికెట్ దక్కింది. అనంతరం నికి ప్రసాద్ మరో వికెట్ సాధించడంతో జింబాబ్వే ఇన్నింగ్స్ మరింత ఒత్తిడిలో పడింది. భారత ఫీల్డర్లు కూడా కీలక పాత్ర పోషించారు. రనౌట్‌తో పాటు క్యాచ్‌ల ద్వారా జింబాబ్వే బ్యాటర్లను పెవిలియన్‌కు పంపారు. దీంతో జింబాబ్వే భారత్ ముందు కేవలం 103 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని మాత్రమే ఉంచగలిగింది. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు షఫాలీ వర్మ, స్మృతి మంధాన అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. తొలి ఓవర్ నుంచే షఫాలీ బౌండరీలతో విరుచుకుపడింది. ఆరంభంలోనే ఫోర్, సిక్స్‌తో జింబాబ్వే బౌలర్లపై ఒత్తిడి పెంచింది. మరోవైపు మంధాన ఆచితూచి ఆడుతూ వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు బాదింది. రెండో ఓవర్‌లో మంధాన వరుసగా రెండు ఫోర్లు కొట్టగా.. ఆ తర్వాత షఫాలీ కూడా తనదైన శైలిలో దూకుడు కొనసాగించింది. మూడో ఓవర్‌లో సిక్స్ బాదిన షఫాలీ.. నాలుగో ఓవర్‌లోనూ బౌండరీతో సత్తా చాటింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య భాగస్వామ్యం వేగంగా పెరిగింది. నాలుగో ఓవర్‌లో మంధాన వరుసగా నాలుగు ఫోర్లు బాదడంతో భారత స్కోరు ఒక్కసారిగా ఊపందుకుంది. ఐదో ఓవర్‌లో షఫాలీ వర్మ వరుస బౌండరీలతో విరుచుకుపడింది. ఆ ఓవర్‌లో నాలుగు ఫోర్లు సహా 21 పరుగులు రావడంతో జింబాబ్వే బౌలర్లు ఒత్తిడికి గురయ్యారు. పవర్‌ప్లే ముగిసే సమయానికి భారత్ వికెట్ నష్టపోకుండా 76 పరుగులు చేసింది. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి ఆరు ఓవర్లలో భారత్ సాధించిన అత్యధిక స్కోర్లలో ఈ ప్రదర్శన కూడా చోటు దక్కించుకుంది. జింబాబ్వే బౌలర్లకు ఎక్కడా అవకాశం ఇవ్వకుండా షఫాలీ, మంధాన పరుగుల వరద పారించారు. షఫాలీ వర్మ తన విధ్వంసక బ్యాటింగ్‌తో ప్రేక్షకులను అలరించింది. బౌలర్ ఎవరన్నది పట్టించుకోకుండా బంతిని బౌండరీ దాటించడమే లక్ష్యంగా ఆడింది. ఏడో ఓవర్‌లో సిక్స్ బాది కేవలం 24 బంతుల్లోనే అర్ధశతకాన్ని పూర్తి చేసింది. ఆ వెంటనే మరో సిక్స్ కొట్టి జట్టును విజయానికి మరింత చేరువ చేసింది. చివరకు 25 బంతుల్లో 55 పరుగులు చేసిన షఫాలీ.. ఆరు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో ఆకట్టుకుంది. బెలవ్డ్ బిజా బౌలింగ్‌లో లాంగ్‌ఆన్‌లో క్యాచ్ ఇవ్వడంతో ఆమె ఇన్నింగ్స్ ముగిసింది. అప్పటికే భారత్ విజయం దాదాపు ఖాయమైంది. షఫాలీ ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన అనుష్క శర్మతో కలిసి మంధాన లక్ష్యాన్ని పూర్తి చేసింది. మంధాన తన దూకుడును కొనసాగిస్తూ 23 బంతుల్లో 40 పరుగులు సాధించింది. ఆమె ఇన్నింగ్స్‌లో ఫోర్లు, సిక్సర్లతో పాటు చక్కటి టైమింగ్ కనిపించింది. చివరికి ఒలిండర్ చారే బౌలింగ్‌లో భారీ సిక్సర్ బాది మంధాన మ్యాచ్‌ను ముగించింది.

# పవర్‌లిఫ్టింగ్‌లో ఐఆర్ఎస్ అధికారిణికి 3 స్వర్ణాలు

ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్) అధికారిణి ఏక్తా బిష్ణోయ్ క్రీడా ప్రపంచంలో చరిత్ర సృష్టించారు. అమెరికాలో జరిగిన వరల్డ్ మాస్టర్స్ క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఏకంగా మూడు స్వర్ణ పతకాలను కైవసం చేసుకుని దేశం గర్వపడేలా చేశారు. ఈ విజయంతో, మాస్టర్స్-2 విభాగంలో స్వర్ణం గెలిచిన తొలి భారత మహిళా పవర్‌లిఫ్టర్‌గా ఆమె రికార్డులకెక్కారు. ఈ పోటీల్లో ఏక్తా బిష్ణోయ్ మొత్తం 362.5 కిలోల బరువును ఎత్తి, జపాన్, కెనడాకు చెందిన బలమైన ప్రత్యర్థులను అధిగమించారు. ఒకవైపు ఉన్నత ప్రభుత్వ బాధ్యతలు నిర్వర్తిస్తూనే, కఠినమైన పవర్‌లిఫ్టింగ్ శిక్షణను కొనసాగించడం ఆమె అంకితభావానికి నిదర్శనం. అయితే, ఈ విజయం అంత సులువుగా దక్కలేదు. టోర్నమెంట్‌కు ముందు భారత జట్టు కోచ్ సునీల్ కుమార్ యూఎస్ వీసా తిరస్కరణకు గురైంది. అయినా ఏమాత్రం వెనకడుగు వేయని ఏక్తా, వీడియో కాల్స్ ద్వారా కోచ్ సునీల్ నుంచి సూచనలు తీసుకున్నారు. టీమ్ అధికారి ఇబ్రహీం సహకారంతో వ్యూహాత్మకంగా ఆడి చారిత్రక విజయాన్ని అందుకున్నారు. గెలుపు వ్యూహంపై కోచ్ సునీల్ కుమార్ మాట్లాడుతూ, "మా వ్యూహం చాలా స్పష్టంగా ఉంది. స్క్వాట్ ఈవెంట్ ముగిసేసరికే సమీప ప్రత్యర్థిపై 20 కిలోల ఆధిక్యాన్ని సాధించాం. బెంచ్ ప్రెస్‌లో ఆ ఆధిక్యాన్ని నిలబెట్టుకుని, చివరగా 150 కిలోల డెడ్‌లిఫ్ట్‌తో భారత్‌కు స్వర్ణ పతకాన్ని ఖాయం చేశాం" అని వివరించారు. ఏక్తా ఢిల్లీలోని నేతాజీ జిమ్‌లో కోచ్ సునీల్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్నారు.



# శ్రేయస్ అయ్యర్‌కు స్పెషల్ అవార్డు

వెస్టిండీస్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో అద్భుతంగా రాణించిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు ప్రత్యేక అవార్డు లభించింది. ఈ సిరీస్‌లో బ్యాటింగ్‌తో పాటు నాయకత్వంలోనూ ఆకట్టుకున్న అతడికి టీమిండియా మేనేజ్‌మెంట్ 'ఇంపాక్ట్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును అందించింది. సిరీస్ ముగిసిన తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శ్రేయస్‌కు ఈ అవార్డును అందించారు. భారత జట్టు ట్రైనింగ్ అసిస్టెంట్ నువాన్ సేనవిరత్నే శ్రేయస్ ప్రదర్శనను ప్రశంసిస్తూ ఈ అవార్డును అందజేశాడు. సిరీస్‌లో శ్రేయస్ అయ్యర్ ఐదు ఇన్నింగ్స్‌ల్లో మొత్తం 181 పరుగులు చేశాడు. లక్నోలో జరిగిన తొలి టీ20లో కేవలం 43 బంతుల్లోనే అజేయమైన 102 పరుగులు చేసి జట్టు విజయంలో ప్రధానపాత్ర పోషించాడు.

# షాయ్ హోప్ కోసం ఐపీఎల్ ఫ్రాంచైజీల పోటీ



వెస్టిండీస్ టీ20 కెప్టెన్ షాయ్ హోప్ తన అద్భుతమైన ఫామ్‌తో ఐపీఎల్ ఫ్రాంచైజీల దృష్టిని బలంగా ఆకర్షిస్తున్నాడు. ఇటీవలే భారత పర్యటనలో సెంచరీల మోత మోగించి, పరుగుల వరద పారించిన హోప్, రాబోయే ఐపీఎల్ 2027 వేలంలో కీలక ఆటగాడిగా మారడం ఖాయంగా కనిపిస్తోంది. అతని ప్రస్తుత ఫామ్, బహుముఖ నైపుణ్యాల దృష్ట్యా పలు జట్లు అతడిని దక్కించుకోవడానికి పోటీ పడొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. భారత్‌తో జరిగిన నాలుగు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో షాయ్ హోప్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. రెండు సెంచరీలు, ఒక అర్ధ సెంచరీతో సిరీస్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. సిరీస్‌ను 2-2తో సమం చేయడంలో విండీస్ తరఫున కీలక పాత్ర పోషించాడు. వన్డేల్లోనూ స్థిరమైన ప్రదర్శన కనబరిచాడు. అంతేకాకుండా, ఈ పర్యటనలో ఒక ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఫుల్ మెంబర్ ప్లేయర్‌గానూ రికార్డు సృష్టించాడు. ఈ అద్భుత ప్రదర్శనతో, డిసెంబర్‌లో జరగనున్న ఐపీఎల్ వేలంలో అతనికి భారీ డిమాండ్ ఏర్పడే అవకాశాలున్నాయి. గతంలో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఆడిన హోప్‌ను తిరిగి దక్కించుకోవడానికి కొన్ని జట్లు ఆసక్తి చూపుతున్నాయి.




## వారణాసి వాయిదా?

టాలీవుడ్‌లో వరుసగా సినిమాల విడుదల తేదీల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా ప్రభాస్ నటిస్తున్న 'స్పిరిట్' చిత్రాన్ని వచ్చే ఏడాది దీపావళికి విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. మరోవైపు త్రివిక్రమ్ తెరకెక్కిస్తున్న 'ఆదర్శ కుటుంబం' అదిగో ఇదిగో అన్నారే తప్పా.. రిలీజ్ డేట్ ఊసే లేదు. అంటే విడుదల తేదీపై ఇంకా స్పష్టత రాలేదనే తెలుస్తోంది. ఇలా పలు సినిమాల విడుదల తేదీలు మారుతుండటంతో ఇప్పుడు అందరి దృష్టి దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి'పై పడింది. గతంలో 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' చిత్రాల విడుదల తేదీల్లోనూ మార్పులు చోటుచేసుకున్న నేపథ్యంలో.. ఇప్పుడు మహేశ్‌బాబు సినిమా విషయంలోనూ అలాంటిదే జరుగుతుందా? అనే చర్చ మొదలైంది. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి విజువల్ ఎఫెక్ట్స్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కీలకం కానున్నాయి. ఇలాంటి సినిమాలకు నిర్మాణానంతర పనులు పూర్తిచేయడానికి ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంటుంది. మరోవైపు ఇతర భారీ చిత్రాల విడుదల తేదీల్లోనూ మార్పులు చోటుచేసుకుంటుండటంతో 'వారణాసి' విడుదలపై అభిమానుల్లో చర్చ నడుస్తోంది. అయితే, ఈ సినిమా విడుదల తేదీ మారబోతోందంటూ జరుగుతున్న ప్రచారానికి ఇప్పటివరకు అధికారికంగా స్పష్టత లేదు. చిత్రబృందం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే సినిమా విడుదలవుతుందా? లేక ఏదైనా మార్పు ఉంటుందా? అనేది తెలియాల్సి ఉంది.



## నా ముఖం వాచిపోయిందని..

సినిమా తారలు సైతం తమ రూపం(బాడీ) గురించి ఇతరులు ఏమనుకుంటారోనని భయపడుతుంటారు. తాజాగా హీరోయిన్ నివేదా థామస్ చేసిన ఓ పోస్ట్‌లో ఇదే విషయాన్ని వెల్లడించింది. ఈ ఏడాది మొదట్లోనే దిగిన కొన్ని ఫొటోలను ఇప్పటివరకు సోషల్ మీడియాలో పంచుకోలేకపోయానని ఆమె తెలిపింది. తన ముఖం ఉబ్బినట్లు కనిపిస్తుందేమో.. ఇతరులు ఏమనుకుంటారోననే ఆలోచనలతో వాటిని తన గ్యాలరీలోనే ఉంచేసినట్లు తెలిపింది. 'ఆ రోజు తాను ఎంతో అందంగా కనిపించాను.. ఆ ఫొటోలను చూసిన ప్రతిసారీ అప్పటి జ్ఞాపకాలు, నవ్వులు, ఉదయాన్నే నిద్రలేవడం, కాఫీ కౌంటర్ దగ్గరకు వెళ్లడం, సంతోషనంగా గడిపిన క్షణాలు గుర్తుకొచ్చేవి. అయినప్పటికీ నన్ను చూసిన ఇతరులు ఏమంటారో అనే ఆలోచన అప్పటి ఫొటోలను పోస్ట్ చేయకుండా అడ్డుకున్నాయి. ఇన్ని నెలలపాటు వాటిని దాచిపెట్టడం బాధగా ఉంది' అని పేర్కొంది. 'ప్రస్తుతం ప్రతిదీ కృత్రిమంగానే మారుతోంది. నిజమైన మనిషిలా మన భావోద్వేగాలతో సహా సహజంగా ఉండటమే అందమైన విషయం. మనలో కలిగే ఆలోచనలను పట్టించుకోకుండా ఉండడం కాదని.. వాటి అంగికరిస్తూనే జీవితాన్ని ఆస్వాదించాలి' అని చెప్పింది. స్వేచ్ఛగా ఉండాలని పోస్ట్ ద్వారా సందేశమిచ్చింది. ప్రస్తుతం ఆమె చేసిన పోస్ట్ వైరల్ అవుతోంది.



## నాన్-బెయిలబుల్ వారెంట్

ప్రముఖ బాలీవుడ్ నటి రాఖీ సావంత్‌కు ఊహించిన షాక్ తగిలింది. 2010లో చోటుచేసుకున్న లక్ష్మణ్ అహిర్వార్ ఆత్మహత్య కేసులో ఆమెకు వ్యతిరేకంగా ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ ఫాస్ట్ ట్రాక్ కోర్టు నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి కోర్టులో జరుగుతున్న విచారణకు రాఖీ సావంత్ చాలాకాలం నుంచి నోటీసులు తీసుకుంటూ హాజరుకాకపోవడంతో, అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి ఈ కఠినమైన ఉత్తర్వులను జారీ చేసినట్లుగా డిస్ట్రిక్ట్ గవర్నమెంట్ కౌన్సెల్ మృదుల్ కాంత్ శ్రీవాత్సవ మీడియాకు వెల్లడించారు. కాగా, ఝాన్సీలోని హన్సారీ ప్రేమ్‌నగర్ ప్రాంతానికి చెందిన లక్ష్మణ్ అహిర్వార్, తన భార్య అనితతో ఏర్పడిన దాంపత్య విభేదాల పరిష్కారం కోసం 2010 అక్టోబర్‌లో ప్రసారమైన రాఖీ కా ఇన్సాఫ్ అనే రియాలిటీ షోలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా రాఖీ సావంత్ తనపై తీవ్ర స్థాయిలో అభ్యంతరకర, అవమానకర వ్యాఖ్యలు చేశారని, ఆ అవమానాన్ని తట్టుకోలేక లక్ష్మణ్ అహిర్వార్ 2010 నవంబర్ 10న ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపణలు ఉన్నాయి. మృతుడు లక్ష్మణ్ ఆత్మహత్య అనంతరం ఆయన తల్లి సావిత్రి స్థానిక ప్రేమ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 'రాఖీ కా ఇన్సాఫ్' షోలో రాఖీ సావంత్ వాడిన భాష, చేసిన అవమానకర వ్యాఖ్యలే తన కొడుకు మరణానికి కారణమని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

## కావాలనే ది ప్యారడైజ్‌పై నెగెటివ్ ప్రచారం: తమ్మారెడ్డి



నాని హీరోగా వచ్చిన లేటేస్ట్ మూవీ ది ప్యారడైజ్. శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద అంతగా మెప్పించలేకపోయింది. ఓ జాతి మనుగడ కోసం చేసే పోరాటం ఆధారంగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నప్పటికీ అనుకన్న స్థాయిలో కలెక్షన్స్ రాబట్టలేకపోయింది. దీంతో బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. ఈ నేపథ్యంలో ఈ మూవీ ఫలితం గురించి ప్రముఖ టాలీవుడ్ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడారు. ది ప్యారడైజ్ మూవీపై నెగెటివ్ ప్రచారం చేయడం ఎందుకని ఆయన ప్రశ్నించారు. సినిమా రిలీజైన మొదటి రోజు నుంచే ది ప్యారడైజ్‌పై నెగెటివ్ ప్రచారం చేశారని విమర్శించారు. ఈ మూవీ గురించి నెగెటివ్ రాయొద్దని చెప్పినవాళ్లే.. ఆ పని చేశారని తమ్మారెడ్డి ఆరోపించారు. తాజా ఇంటర్వ్యూలో ఆయన ఈ విధంగా స్పందించారు.



## రణబాలి.. తగ్గేదేలే..!

విజయ్ దేవరకొండ, రష్మిక జంటగా నటించిన లేటేస్ మూవీ రణబాలి. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తొలి రోజు ఈ మూవీకి మిక్స్‌డ్ టాక్ వచ్చింది. విజయ్, రష్మిక యాక్టింగ్, స్టోరీ బాగున్నప్పటికీ.. నిడివి, స్లోనెరేషన్ కొంత ఇబ్బందికరంగా మారాయని పలు వెబ్‌సైట్లు తమ రివ్యూల్లో పేర్కొన్నాయి. ఫలితంగా తొలి రోజు ఈ చిత్రం రూ. 16.15 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టింది. అయితే టాక్ ఎలా ఉన్నప్పటికీ రణబాలికి ఆదరణ కనిపిస్తోంది. ఈ సినిమా టికెట్స్ హాట్ కేకుల్లా బుకింగ్స్ అవుతున్నాయి. ఇదంతా చూస్తుంటే రణబాలి నెమ్మదిగా పుంజుకుంటున్నట్లు అర్థమవుతోంది. ఈ సినిమాకు బుక్‌మైషోలోనే మొత్తం 750కె టికెట్స్ సేల్ అయ్యాయి. దీంతో మొదటి వారంలోనే ఈ సంఖ్య 1 మిలియన్ దాటుతుందని నిర్మాతలు భావిస్తున్నారు. కాగా.. ఈ చిత్రంలో ది మమ్మీ ఫేమ్ ఆర్నాల్డ్ వోస్లూ విలన్ రోల్ పోషించారు. ఈ చిత్రంలో ఈశ్వరీ రావు, లాల్, వినోద్ సాగర్, మధు నందన్, కిషోర్ కుమార్ కీలక పాత్రల్లో కనిపించారు. ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌లో నిర్మించారు.



బాలీవుడ్ బోల్డ్ బ్యూటీ సన్నీలియోన్ వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. విభిన్నమైన పాత్రలు చేస్తూ దూసుకెళ్తున్న ఈ భామ.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొని ఎమోషనల్ కామెంట్స్ చేశారు. తన కెరీర్ తొలినాళ్ల కష్టాలు, చిన్ననాటి ఆర్థిక సమస్యల గురించి మాట్లాడుతూ.. జీవితంలో సక్సెస్ సాధించడానికి ఎలాంటి షార్ట్‌కట్‌లు ఉండవని, కేవలం కష్టపడటం

## బాల్యమే వాస్తవాన్ని నేర్పిస్తాయి

వల్ల మాత్రమే అనుకున్నది సాధించగలమని ఆమె స్పష్టం చేశారు. చిన్న వయసులోనే తాను ఎదుర్కొన్న అనుభవాలే తనకు ఈ వాస్తవాన్ని నేర్పించాయని తెలిపారు. చిన్నతనంలో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నానని, సమాజంలో రకరకాల విమర్శలను భరించానని సన్నీలియోన్ గుర్తుచేసుకున్నారు. కేవలం 7, 8 ఏళ్ల వయసులోనే తాను డబ్బు సంపాదించడం కోసం చిన్నచిన్న పనులు చేయడం మొదలుపెట్టినట్లు చెప్పారు. ఇంటింటికీ వెళ్లి వస్తువులు అమ్మడం, మంచును శుభ్రం చేయడం, పలు స్టాళ్లు పెట్టడం లాంటి ఎన్నో పనులు చేశానని తెలిపారు. అంత చిన్న వయసులో కష్టపడినా పెద్దగా డబ్బులు వచ్చేవి కాదని, కేవలం ఒక చాక్‌లెట్ లేదా క్యాండీ కొనుక్కునేంత మాత్రమే దొరికేవని ఆమె చెప్పారు. అయినప్పటికీ, కష్టపడి పనిచేస్తేనే ఫలితం ఉంటుందనే నమ్మకం అప్పుడే తనలో బలపడిందని అన్నారు. జీవితంలో గడ్డు పరిస్థితులు ఎదురైనప్పుడు గతంలో ఎన్నడూ ఊహించని కొన్ని కఠిన నిర్ణయాలు కూడా తీసుకోవాల్సి వచ్చిందని ఆమె ఎమోషనల్ అయ్యారు.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of RS USAR PUBLICATIONS, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by KALIDINDI SUMALATHA at KING DIGITAL OFFSET PRINTERS, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. PRGI NO: TGTEL/26/A2948, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467